అరకొరగా నీటి తీరువా వసూళ్లు

- రూ.41 కోట్లకు వసూలైంది.. రూ.12 కోట్లే..
- ఇంకా వసూళ్లు జరగాల్సింది రూ.29 కోట్ల 53లక్షల51వేలు
- రైతులు వాట్సాప్ యాప్‌లోనూ చెల్లించవచ్చు : డీఆర్వో

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)



జిల్లాలో నీటి తీరువా బకాయిల వసూళ్ల తీరు ప్రహసనంలా మారింది. మూడేళ్ల నుంచి రూ.41కోట్ల 63లక్షల51 వేలు వసూలు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం రూ.12 కోట్లే వసూలు కాగా ఇంకా రూ.29 కోట్ల 53 లక్షల 51 వేలు ప్రభుత్వ ఖాతాలో జమ కావాల్సి ఉంది. ఏలూరు డివిజన్‌లో మొండి బకాయిలున్నట్లు చెబుతున్నారు. రైతుల నుంచి వసూలయ్యే నీటితీరువా నిధులతో పంట కాల్వల మరమ్మతులు చేపడతారు. గతంలో వీఆర్వోలు పంటలకు తగ్గట్టు రైతులకు నోటీసులు అందజేసి, పన్ను వసూలు చేసేవారు. ప్రస్తుతం గ్రామ సచివాలయాల్లో రైతులే నేరుగా చెల్లించే విధానాన్ని ప్రవేశపెట్టారు. సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లకు ఈ బాధ్యతలను అప్పగించారు. ఖరీఫ్‌లో ఒకసారి వరి పండిస్తే ఎకరాకు రూ.200, పత్తి, మిర్చికి రూ.100, పసుపు రూ.350, చెరకుకు రూ.350 చొప్పున వసూలు చేస్తున్నారు. చేపలు, రొయ్యల చెరువులకు రూ.500, వాణిజ్యపంటలకు వినియోగించే నీటి ఆధారంగా పన్ను విధిస్తున్నారు. ఖరీఫ్‌తో పాటు రబీలోనూ వరి పండిస్తే ఎకరాకు రూ.350 చొప్పున చెల్లిం చాలి. చాలాకాలం నుంచి ఈ బకాయిలు పేరుకుపోయాయి. ఈ బకాయి లపై అడపాదడపా సమీక్షించి ఆపై మిన్నకుండిపోతున్నారు. దీంతో వసూళ్లు మందగిస్తున్నాయి.

రంగంలోకి ఆర్డీవోలు

ఇటీవల నీటి తీరువా వసూళ్లపై సీసీఎల్ఏ నుంచి అధికారులను ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలన్న ఒత్తిడి పెరిగింది. దీంతో ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్డీవోలు అంబరీష్, రమణ, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ క్షేత్రస్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల బాట పట్టారు. వీఆర్వోలను ఆరా తీస్తున్నారు. దీనిపై సాధ్యమైనంత మేర రైతులే నేరుగా వెళ్లి డిజిటల్ అసిస్టెంట్లకు బకాయి మొత్తాలు చెల్లించేలా ప్రేరణ కల్పించారు. దీంతో కొంతమేర సత్ఫలితాలు వచ్చినట్టు చెబుతున్నారు. జిల్లాలో నీటితీరువా వసూళ్లపై జేసీ ధాత్రిరెడ్డి ఆదేశాల మేరకు నిరంతరం సమీక్షలు జరుపుతున్నామని డీఆర్వో విశ్వేశ్వరరావు తెలిపారు. నీటి తీరువా పన్నులను మన మిత్ర వాట్సాప్ యాప్ ద్వారా చెల్లించవచ్చని, యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రైతులు 95523 00009 నంబర్‌కు నీటి తీరువాను చెల్లించవచ్చని సూచించారు.

చినుకు.. జాడేది!



ఏలూరు రూరల్ మండలం సుంకరవారితోటలో నీరు అందక నెర్రెలు తీసిన నారుమడి

ఒక పక్క నైరుతి రుతుపవనాలు మందగించడంతో జిల్లాలో వర్షాల జాడలేకుండా పోయింది. మరోపక్క కృష్ణా-ఏలూరు కెనాల్ పరిధిలో పంట భూములకు సాగునీరు అందక నారు మడులు ఎండిపోవడమే కాకుండా పంట భూములు నెర్రలిచ్చాయి. ఈ పరిస్థితుల్లో సార్వా సాగు సాగేదెలా..? అని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీటి సమస్య పరిష్కరించాలంటూ పలుచోట్ల ఆయకట్టు శివారు రైతులు రోడ్డెక్కి నిరసనకు దిగుతున్నారు.

సార్వా సాగు సాగేదెలా.. రైతుల ఆవేదన

- కృష్ణా-ఏలూరు కెనాల్ పరిధిలో సాగునీటి ఇబ్బందులు
- ఎండుతున్న వరి నారుమళ్లు
- నెర్రలు తీస్తున్న పంట భూములు
- సాగునీటి కోసం రోడ్డెక్కుతున్న రైతులు

ఏలూరుసిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జూన్‌లో కురిసిన వర్షాల నేపథ్యంలో ముందస్తుగా సార్వా వరి సాగు ప్రారంభమైంది. అయితే జూలైలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా వారం రోజులుగా వర్షాల జాడలేకపోవడంతో వరి నారుమళ్లు ఎండిపోతున్నాయి. జిల్లాలో ఈ ఏడాది సార్వా వరి సాగును 2.24 లక్షల ఎకరాల్లో చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ లక్ష్యంగా నిర్ణయించుకుంది. దీనికి తగ్గట్టుగా 11,248 ఎకరాల్లో వరి నారుమళ్లు వేయాల్సి ఉంది. ఇప్పటివరకు 8,106 ఎకరాల్లో వరి నారుమళ్లు పూర్తి కాగా 20,982 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి. కృష్ణా-ఏలూరు కెనాల్ పరిధిలో ఏలూరు, పెదపాడు, దెందులూరు మండలాల్లో సాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. కెనాల్‌కు ఇవి శివారు భూములు కావడంతో సక్రమంగా నీరు అందడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ మూడు మండలాల పరిధిలోనే సుమారు 58 వేల ఎకరాలు సాగు కావాల్సి ఉంది. ఇక జిల్లాలో పశ్చిమ డెల్టానుంచి గోదావరి కాల్వలకు నీరు విడుదల చేసినా ఎండ తీవ్రత వల్ల పంట పొలాలకు నీటి తడులు సరిపోవడం లేదని రైతులు చెబుతున్నారు. ఒక పక్క భూములు బీటలు వారిపోతున్నాయని, అక్కడ వరి నారుమళ్లు వేయడం కూడా కష్టతరంగా ఉందని రైతులు చెబుతున్నారు. ఇక ఎండల తీవ్రత కారణంగా వరి సాగులో జింక్‌ధాతు లోపం, ఇతర ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు.

పూడుకుపోయిన పంట కాలువలు

ఏలూరు రూరల్ : ఖరీఫ్ పనులు మొదలయ్యాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు పొలాలను దుక్కిచేసి సాగుకు సిద్ధం చేస్తున్నారు. అయితే పంటకు సాగునీరందించే కాలువలు, చెరువులు పూడికలు, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తుండడంతో రైతులు కలత చెందుతున్నారు. కాలువ పూడికను ఈ ఏడాది జనవరిలో నామమాత్రంగా తీశారు. అవసరం లేని సమయంలో పూడిక తీసి నిధులు పక్కదారి మళ్లించారని విమర్శలు ఉన్నాయి. ఏలూరు రూరల్ మండలం కృష్ణా డెల్టా పరిధిలోని వెంకటాపురం, మాదేపల్లి, జాలిపూడి, చాటపర్రు, పోణంగి, కొమడవోలు, కాట్లంపూడి, తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల కృష్ణా డెల్టా భూములకు సాగునీరు అందడం లేదు. నీరందక నారుమళ్లు ఎండిపోతున్నాయి. మరోవైపు కృష్ణా మెయిన్ కెనాల్ నుంచి జాలిపూడి, మాదేపల్లి వైపు వెళ్లే ప్రధాన పంట కాలువ గుర్రపుడెక్క తూడు, తుక్కు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. నాట్లు వేసిన చేలు బీటలు వారాయని, కృష్ణా డెల్టా శివారు ప్రాంత భూములకు సాగు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.



సుంకరవారి తోట వంతెన వద్ద పంట కాలువ దుస్థితి



పెయ్యేరులో తెగులు సోకిన సార్వా వరి నారుమడి

నీటి కొరతతో నారుమడికి తెగుళ్లు

ముదినేపల్లి:సాగునీటి ఎద్దడి కారణంగా ముదినేపల్లి ప్రాంతంలోని సార్వా వరి నారుమళ్లకు వివిధ రకాల తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. నీరు పుష్కలంగా అందక నారు చివళ్లు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రైతులు దీనిని ఆకు ఎండు తెగులుగా చెబుతున్నారు. ఈ విషయాన్ని ముదినేపల్లి ఏవో వేణు మాదవ్ దృష్టికి తీసుకువెళ్లగా, నారు చివళ్లు ఎండిపోవడానికి కారణం నారుకు నీటి కొరత అని శాస్త్రవేత్తలు చెబుతున్నారని తెలిపారు. ఈ తెగులు నివారణకు ఐదు సెంట్ల నారుమడికి రెండు కేజీల యూరియా చల్లి, నీరు పెట్టాలని సూచించారు.

నారుమళ్లు ఎండిపోతున్నాయి..

జిల్లాలోని ఏలూరు -కృష్ణా కెనాల్ పరిధిలోని ఏలూరు, దెందులూరు, పెదపాడు మండలాల్లో సాగునీరు అందక వరి నారుమళ్లు ఎండిపోతున్నాయి. కృష్ణా కెనాల్‌కు ఇది శివారు ప్రాంతం కావడంతో సాగు అందడం లేదు. ఈ కెనాల్ పరిధిలో కర్రనాచు తొలగించే పనులు చేపట్టటంతో పెరికేడు నుంచి సాగు నీరు రావడం లేదు. ప్రకాశం బ్యారేజి నుంచి సాగునీరు విడుదల చేసినా ఈ ప్రాంతాలకు సాగు నీరు అందడం కష్టతరంగా మారింది.

- కె.శ్రీనివాస్, ఏపీ రైతు సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి

శివారు గ్రామాలకు సాగు, తాగునీరందించాలి

కైకలూరు : శివారు గ్రామాలకు తాగు, సాగునీరు అందించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడతామని ఇరిగేషన్ డీఈ శిరీష అన్నారు. బుధవారం కైకలూరు ఇరిగేషన్ కార్యాలయంలో నీటి సంఘాల అధ్యక్షులతో సమావేశాన్ని నిర్వహించారు. కాలువ తవ్వకాలు చేసినా శివారు గ్రామాలకు తాగు, సాగునీరు (మిగతా 8వ పేజీలో)



వట్లూరు-పెదపాడు రహదారిలో రాస్తారోకో

రోడ్డెక్కిన రైతన్నలు

పెదపాడు/ఏలూరుకార్పొరేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సాగునీరు కోసం కృష్ణా డెల్టా శివారు భూములకు చెందిన రైతులు బుధవారం రోడ్డెక్కారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో వట్లూరు-పెదపాడు రహదారిలో, ఏలూరు-కైకలూరు రహదారిలో రైతులు, కౌలు రైతులు రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కృష్ణా డెల్టా శివారు భూములకు సాగునీరు అందక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. అవసరమైతే పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా వస్తున్న నీటిని కృష్ణా కెనాల్‌లోకి మళ్లించి కృష్ణా డెల్టా శివారు ప్రాంత భూములకు సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. కాగా ఎండిన వరినారు మట్టి గెడ్డలతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీరు అందించి పంటను కాపాడాలంటూ నినాదాలు చేశారు.



సమావేశంలో పాల్గొన్న ఇరిగేషన్ డీఈ శిరీష తదితరులు

పేదరికం లేని సమాజమే పీ-4 ధ్యేయం

అధికారులు, పారిశ్రామికవేత్తల సమీక్షలో మంత్రి నాదెండ్ల మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్. చిత్రంలో ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): 'సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించి పేదరికం లేని సమాజాన్ని రూపొందించాలన్నదే పీ-4 కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. పేదలకు సేవ చేద్దామని, వారి జీవన ప్రమాణాల స్థాయిని పెంచేందుకు సంకల్పించి, సదుద్దేశ్యంతో ఉన్న ధనవంతులకు పీ-4 కార్యక్రమం ఒక మంచి వేదిక' అని పౌరసరఫరాలశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు, అధికారులతో పీ-4 కార్యక్రమంపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ 'జిల్లాలో ఇంతవరకు 95,905 మంది బంగారు కుటుంబాలను గుర్తించాం. వారిలో 5,181 మంది కుటుంబాలకు మార్గ దర్శకులు అండగా నిలబడ్డారు. అధికారులు భాగస్వామ్యం వహించి పేదరికం నిర్మూలనకు కృషి చేయాలి' అని సూచించారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 129 మార్గదర్శకులను గుర్తించి 5,181 కుటుంబాలతో సమావేశాలను నిర్వహించామన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ తాను రూ.10లక్షల విలువ చేసే వంద గొర్రెలను పేద కుటుంబాలకు అందించానన్నారు. చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో పారిశ్రామిక వేత్తలను మార్గదర్శకులుగా గుర్తించి వారి సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వివిధ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు తాము మార్గదర్శకులుగా చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, ఆర్డీవోలు అచ్యుత్ అంబరీష్, రమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అటవీశాఖాధికారులపై మంత్రి ఆగ్రహం

అడవిలో దొరికే వెదురుతో ఉపాధి కల్పించుకునే గిరిజనులకు ఆటంకాలు కలిగించొద్దని మంత్రి నాదెండ్ల మనోహర్ అటవీశాఖాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పీ-4 సమీక్షలో గిరిజనులు హ్యాండ్‌క్రాఫ్ట్ తయారు చేసే విషయంపై మంత్రి ఐటీడీఏ పీవో రాములను ఆరా తీశారు. అడవిలో గిరిజనులు వెదురు తీసుకుంటుంటే అటవీఅధికారులు అడ్డుకుంటున్నారని మంత్రికి వివరించారు. మంత్రి స్పందిస్తూ గిరిజనులు జీవనోపాధి పొందేందుకు సౌకర్యాలు కల్పించాలే తప్ప వారి ఉపాధి దెబ్బతీసేలా ఆంక్షలు పెట్టకండి అంటూ ఆదేశించారు. ఇక మీదట ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్‌కు సూచించారు. కాగా పీ-4 అమలులో మార్గదర్శకుల గుర్తింపు, బంగారు కుటుంబాల అనుసంధానంపై నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. సీపీవో సీహెచ్ వాసు దేవరరావు, జడ్పీ సీఈవో శ్రీహరి, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి శ్రీదేవి

న్యాయ సేవలపై అవగాహన కల్పించాలి

- జిల్లా జడ్జి శ్రీదేవి..బైక్ ర్యాలీ ప్రారంభం

ఏలూరు క్రైం, జూలై 16(ఆంధ్రజ్యోతి): న్యాయసేవలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ప్రతి పౌరుడు బాధ్యత తీసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా జడ్జి ఎస్.శ్రీదేవి అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం ఉదయం బైక్‌ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారం రోజుల నుంచి మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారంపై వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజలను అవగాహన కలిగిస్తున్నామని, అందులో భాగంగా బైక్‌ర్యాలీని నిర్వహించామన్నారు. మధ్యవర్తిత్వం వల్ల సత్వర ప్రయోజనం సమకూరుతుందన్నారు. ఏడవ అదనపు జిల్లా జడ్జి వై.శ్రీనివాసరావు, ఎనిమిదవ అదనపు జిల్లా జడ్జి ఐ.శ్రీనివాస మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బులికృష్ణ, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.రఘునాథ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం, ప్రభుత్వ న్యాయవాది బీజే రెడ్డి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు

చింతలపూడి, జూలై 16(ఆంధ్రజ్యోతి): చింతలపూడి నగర పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పారిశుధ్య కార్మికులకు, ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు అపరిష్కృతంగా ఉన్న డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.నెలకు రూ.21 వేలు వేతనం ఇవ్వాల్సి ఉండగా రూ.15 వేలు మాత్రమే ఇస్తున్నారని, ఒక్కొక్కరికి రూ.రెండు లక్షలకు పైగా ఏరియర్స్ బకాయిలు ఉన్నా యని, పని గంటలు అధికంగా చేయిస్తున్నారని, క్యాజువల్ లీవ్‌లు, జాతీయ సెలవులు ఇవ్వడం లేదని ఆరోపించారు. కార్మిక నాయకులు పార్వతి, పద్మ, కమలకుమారి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

దామరచర్ల పాఠశాలకు ఉపాధ్యాయుడి నియామకం

కుక్కునూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామరచర్ల పాఠశాలలో ఉపాధ్యాయులు లేక చదువు చెప్పేవారు లేరని బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'టీచర్లు లేని పాఠశాల' శీర్షికన వచ్చిన కథనానికి విద్యాశాఖాధికారులు స్పందించారు. ఈ పాఠశాలలో 25 మంది విద్యార్థులు రోజు పాఠశాలకు వస్తున్నా వారికి ఉపాధ్యాయుడు లేక చదువు చెప్పేవారు లేరు. దీనిపై అధికారులు స్పందిస్తూ ఒక ఉపాధ్యాయుడిని నియమించారు. దీంతో కొంత వరకైనా తమ పిల్లలకు విద్యాబోధన జరుగుతుందంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వ్యామోహం

- పెరుగుతున్న వివాహేతర సంబంధాలు
- హత్యలకు దారితీస్తున్న వైనం
- కుటుంబాలు చిన్నాభిన్నం

హుండీల్లో చిల్లర గల..గల

- ద్వారకా తిరుమల చిన వెంకన్నకు నెలనెలా రూ. 10 లక్షల వరకు చిల్లర..

■ లోపలి పేజీలో..

బారుమన్నారు!

ప్రభుత్వానికి ఆదాయం తెచ్చే విభాగాల్లో ప్రధానమైంది ఎక్సైజ్. ప్రభుత్వం మారినప్పుడల్లా ఎక్సైజ్ విధానం మారుతుంది.గత వైసీపీ పాలనలో బార్లు నడిపిన వారంతా నిండా మునిగారు. ఈసారి బార్ లైసెన్సుల గడువు వచ్చే నెలాఖరుతో ముగియనుంది. ఈ లోపే వైన్‌షాపుల దగ్గర పర్మిట్ రూమ్‌లు ఇచ్చే ప్రతిపాదన పరిశీలనలో ఉండడం, బార్ విషయంలో ఎలాంటి కొత్త నిర్ణయాలు తీసుకుంటారనే దానిపైనే తర్జనభర్జన. ఒకవేళ ఎక్సైజ్ పాలసీలో ఆదా యార్జన ప్రాధాన్యతగా తీసుకుంటే వ్యాపారానికి దూరమవడానికి సిద్ధమన్నట్లుగా ఇప్పటికే బార్ యజమానులు చెబుతున్నారు.

- వచ్చే నెలాఖరుతో ముగియనున్న బార్ల లైసెన్సు గడువు
- నష్టాల పాలయ్యామంటూ లబోదిబో
- కొత్త పాలసీని బట్టే రంగంలోకి.. లేకుంటే ఇంటికే..
- పర్మిట్‌రూమ్‌ల ప్రతిపాదనతో ఇప్పటికే కొందరు వెనక్కి



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం పాలసీలో మార్పులు, చేర్పులు జరిగాయి. మద్యం అమ్మకాలు తారస్థాయికి చేరాయి. జగన్ జమానాలో 'జే' బ్రాండ్‌లకు ప్రాధాన్యం ఇవ్వడంతో అమ్మకాలు వంకర టింకరగా సాగాయి. ఆ మద్యం తాగిన అనేకమంది అనారోగ్యం పాలయ్యారు. కావాల్సిన బ్రాండ్‌లు దొరక్క ఏకంగా తెలంగాణకు లాభం చేకూర్చేలా ఏపీ సరిహద్దులు దాటి వెళ్లారు. దీనిని గమనించి తెలుగుదేశం ప్రభుత్వం అన్ని రకాల బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చింది. అన్నింటి కంటే మించి సామాన్యులు కోరుకున్న విధంగా రూ.99 మందును అందుబాటులోకి తెచ్చారు. లైసెన్సు వైన్ షాపులన్నీ అమ్మకాల్లో పుంజుకున్నాయి. ఇంకోవైపు ఇప్పటికే జిల్లాలో బార్‌లన్నీ నష్టాల్లో మునిగాయి. మూడేళ్లకొకసారి బార్ల లైసెన్సులను రెన్యువల్ చేస్తారు. దీనికిగాను ఎక్సైజ్ పాలసీలో మార్పులు, చేర్పులు జరుగుతాయి. గత మూడేళ్లుగా మనుగడలో ఉన్న బార్లు అన్నింటికి లైసెన్సులు గడువు ఆగస్టు నెలాఖరుకు ముగియనుంది. ఇప్పటికే జగన్ జమానాలో ఒకటి,రెండు తప్ప మిగతా బార్లన్నీ అత్యధిక లైసెన్సు ఫీజులు చెల్లించి నష్టాలు పాలయ్యాయి. అప్పటి ప్రభుత్వమే నేరుగా వైన్ షాపులను నిర్వహించింది. బార్లలో కొంత మేర అమ్మకాలకు అనుగుణంగా చూసీచూడనట్లుగా వ్యవహరించింది. మధ్యేమార్గంగా ఎక్సైజ్ విధానంలో తప్పులు దొర్లాయి. ఉదాహరణకు మూడేళ్లపాటు ఒక బార్ నిర్వహించేందుకు అవకాశం ఉన్నా ఏటా లైసెన్సు ఫీజును పెంచి ప్రభుత్వానికి సమర్పించుకోవాల్సిందే. ఏలూరు నగరంలోని బార్లు చేజిక్కించుకునేందుకు జగన్ హయాంలో స్థానికంగా పోటీపడ్డారు. అప్పటి వరకు రూ.30 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు ఏడాది ఫీజు ఉన్న బార్ లైసెన్సులు పొందేందుకు పోటీ నెలకొనగా, ఇది కాస్త రూ.93 లక్షలకు ఎగబాకింది. ఏలూరు నగరంలోని సుమారు 10 బార్లలో దాదాపు ఇదే తరహా పరిస్థితి. కానీ వ్యాపారంలో ఈ లెక్క తారుమారైంది. రోజూవారీ అమ్మకాలు ఆశించిన విధంగా సాగలేదు. ఎన్నికలకు ముందు ఆ తర్వాత బార్ల నిర్వహణ భారంగా మారింది. కానీ ప్రభుత్వానికి చెల్లించాల్సిన లైసెన్సు ఫీజులు మాత్రం యథావిధిగానే ముందస్తుగా చెల్లించారు.

కొత్త పాలసీ కోసం ఎదురుచూపులు..

తెలుగుదేశం ప్రభుత్వం ఈసారి బార్ల లైసెన్సుల విధానంలో ఏ నిర్ణయం తీసుకుబోతుందోనన్నదే మద్యం వ్యాపారులకు ఉత్కంఠగా మారింది. గతంలో మాదిరిగానే ఉన్న బార్లను యథాతథంగా కొనసాగిస్తారా? లేక లాటరీ పద్ధతిలో బార్ల ఎంపిక జరగబోతుందా? అనేది తేలాల్సి ఉంది. దీనిని బట్టి బార్లు లైసెన్సుల కోసం వచ్చేవారి సంఖ్య ఆధారపడి ఉంది. వాస్తవానికి అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఆ పార్టీకి చెందిన వారికే మద్యం వ్యాపారంలో అనుకూలత ఉంటుంది. ఈసారి తెలుగుదేశం, మిగతా కూటమి పక్షాలకు చెందిన అనుకూలురు చేతిలో అత్యధిక వైన్ షాపులున్నాయి. లాటరీ పద్ధతితో వైన్‌షాపుల నిర్వహణకు దిగినా ఆ తర్వాత స్థానిక నేతలు వీటిని అందిపుచ్చుకున్నారు. అదే బార్ల విషయానికి వచ్చేసరికి ప్రభుత్వం తీసుకునే విధానం బట్టే ఆధారపడి ఉంటుంది. ఈసారి బార్ల లైసెన్సుల విధానంతో పాటు పర్మిట్‌రూమ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రావడంతో ఇవన్నీ పరి శీలనలో ఉన్నాయి. ఇప్పుడు ఈ విధానాన్ని అమల్లోకి తెస్తే బార్ల విషయంలో ముందుకొచ్చే వారి సంఖ్య పూర్తిగా తగ్గుముఖం పట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. 'ఎంతో ఊహించు కుని బార్ల లైసెన్సుల కోసం ఎగబడ్డాం. అప్పట్లో ప్రభుత్వమే వైన్ షాపులను నిర్వహించింది. జనం కోరుకున్న బ్రాండ్‌లను సప్లయ్ చేయలేదు. ఏ రకం మందు సప్లయ్ చేస్తే దాన్నే జనానికి రుద్దాలి. దీనికి తోడు అస్థవ్యస్థ విధానాలు. నష్టాలొస్తున్నాయని బావురమన్న ఎవరూ వినిపించుకోలేదు. ఏళ్ల తరబడి ఈ రంగంలో అనుభవం ఉన్నా మేము నష్టపోయాం. కొత్త విధానం బట్టే మళ్లీ కొనసాగాలా?వద్దా అనేది తేల్చుకుంటాం'. ఇది బార్ నిర్వహణలో అనుభవ పూర్వక వ్యాఖ్యానం.

సోలార్ గ్రామాలకు రూ. కోటి నజరానా

నూరు శాతం సోలార్‌పై విద్యుత్ శాఖ కసరత్తు

పశ్చిమ గోదావరి జిల్లాలో మోడల్‌గా ఐదు గ్రామాల ఎంపిక

ముందుకు వచ్చే ఏ గ్రామాలకైనా ప్రాధాన్యం ఇచ్చే ఆలోచన

భీమవరం టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు అనేక పథకాలను అమలు చేస్తోంది. ఇప్పటికే సూర్యఘర్ పథకం ద్వారా బ్యాంకు ద్వారా రుణ సదుపాయంతో పాటు సబ్సిడీ ఇచ్చేవిధంగా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఒక గ్రామంలో ఉన్న విద్యుత్ కనెక్షన్ దారులు సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకుని నూరుశాతం సోలార్ గ్రామంగా మారితే ఆ గ్రామానికి కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయిలను అందించనుంది. దీనిపై కేంద్రం ప్రత్యేక జీవో విడుదల చేసింది. అందులో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లాలో ఐదు గ్రామాలను సోలార్ మోడల్ గ్రామాలుగా జిల్లా కలెక్టర్ నాగరాణి పర్యవేక్షణలో విద్యుత్ శాఖ అధికారులు ఎంపిక చేశారు. 5 వేల జనాభా కలిగిన గ్రామాలను ఎంపిక చేశారు. అందులో భీమవరం డివిజన్‌లో వెంప గ్రామాన్ని ఎంపిక చెయ్యగా, తాడేపల్లి గూడెం డివిజన్ పరిధిలో అలంపురం, భీమవరం డివిజన్‌లోని పాలకోడేరు సబ్ డివిజన్‌లో పాలకోడేరు, తాడేపల్లి గూడెం డివిజన్ తణుకు సబ్ డివిజన్‌లో తేతలి, నరసాపురం డివిజన్‌లోని పాలకొల్లు సబ్ డివిజన్ ఆగర్తిపాలెం గ్రామాలను ఎంపిక చేశారు. ఈ గ్రామాలను నూరు శాతం సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసిన సోలార్ మోడల్ విలేజ్‌లుగా మార్పు చేయనున్నారు.

ఏదైనా గ్రామం నూరుశాతం సోలార్ కనెక్షన్‌లను పెట్టుకుంటే ఆ గ్రామానికి కోటి రూపాయలు కేంద్రం నజరానా అందించనుంది.ఈ నిధులను గ్రామాభివృద్ధికి వినియోగించుకునే అవకాశం ఉంది. దీనికోసం పశ్చిమ గోదావరి జిల్లాలో ఐదు గ్రామాలను మోడల్‌గా ఎంచుకున్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో ఏ గ్రామం ముందుకు వచ్చి కోటి నజరానా దక్కించుకుంటుందో చూడాలి.

లక్ష్యం సాధించేందుకు ఆపసోపాలు

ఎంపిక చేసిన గ్రామాల్లో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునే విధంగా అధికారులు చేస్తున్న ప్రయత్నాలు అంతగా సాగడం లేనట్లుగా కనిపిస్తోంది. ఇచ్చిన లక్ష్యం సాధించటానికి కుస్తీలు పడుతున్నారు. 5 గ్రామాల్లో కలిపి 11,147 కనెక్షన్‌లు ఉండగా ఇప్పటి వరకు 386 దరఖాస్తులు మాత్రమే పోర్టల్‌లో నమోదయ్యాయి. మొత్తం మీద 38 కనెక్షన్‌లు ఏర్పాటు చేశారు.

ముందుకు వచ్చే ఇతర గ్రామాలకూ ప్రాధాన్యం

ఇటీవల ఎంపిక చేసిన ఐదు గ్రామాలు కాకుండా జిల్లాలో ఏ గ్రామమైనా పూర్తిస్థాయిలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వస్తే ఆ గ్రామాలను జిబితాలో చేర్చే విధంగా ఆలోచన చేస్తున్నారు. దీనిపై అవసరమైతే జిల్లా స్థాయి సమావేశంలో అధికారులు, ప్రజా ప్రతినిదుల దృష్టికి తీసుకు వెళ్లాలనే ఆలోచన జిల్లా స్థాయి అధికారుల్లో ఉంది. అలా ముందుకు వచ్చే గ్రామాలకై అన్వేషణ చేస్తున్నారు.

ఎంపిక చేసిన గ్రామాల వివరాలు

డివిజన్	మోడల్ గ్రామం	విద్యుత్ కనెక్షన్‌లు	దరఖాస్తులు	కనెక్షన్ ఇచ్చినవి
భీమవరం	వెంప	1592	84	03
టీపీ గూడెం	అలంపురం	1980	174	17
భీమవరం	పాలకోడేరు	2688	99	04
టీపీ గూడెం	తేతలి	2739	17	10
నరసాపురం	ఆగర్తిపాలెం	2148	12	04
	మొత్తం	11,147	386	38



సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించండి

ఏపీ-ఈపీడీసీఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ టి.వనజ



భీమవరంటౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) :ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని అధికారులు ఉద్యోగులు సిబ్బంది ప్రజల్లోకి తీసుకువెళ్లి పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని ఏపీ ఈపీడీసీఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ టి.వనజ పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. డివిజన్‌ల వారీగా సోలార్ విద్యుత్ కనెక్షన్‌లకు సంబంధించిన దరఖాస్తులు ఇంతవరకు పరిష్కరించి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నవాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన లక్ష్యాల కంటే ఎక్కువ చేసే విధంగా చూడాలన్నారు. ప్రతి అసిస్టెంట్ ఇంజనీర్ తన పరిధిలో రోజుకు ఒక్క సోలార్ యూనిట్‌ను ఇన్‌స్టాల్ చేసే విధంగా నెలకు 30 యూనిట్లను లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. బ్యాంకు అధికారులు రుణాలు మంజూరు చేసే విషయంలో సహకరించాలన్నారు. ఎస్ఈ ఆలపాటి రఘునాధబాబు, జిల్లా లీడ్ మేనేజర్ నాగేంద్ర ఈఈ నరహరశెట్టి వెంకటేశ్వరరావు, ఏడీఈలు కొత్తపల్లి రాంబాబు, టి.వెంకట్రావు,శ్రీనివాసరావు, సోలార్ యూనిట్ల వెండర్లు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు



అన్నదాన భవనంలో భక్తుల అభిప్రాయాలను తెలుసుకుంటున్న జాయింట్ కమిషనర్ భ్రమరాంబ... లడ్డూ ప్రసాదం తయారీని పరిశీలిస్తున్న జేసీ

భక్తులకు మంచి దర్శనం, నాణ్యమైన ప్రసాదం అందించాలి

రాష్ట్ర దేవదాయ శాఖ జాయింట్ కమిషనర్ భ్రమరాంబ

ద్వారకాతిరుమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో భక్తులకు మంచి దైవ దర్శనంతో పాటు నాణ్యమైన ప్రసాదాలను అందించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ భ్రమరాంబ సూచించారు. ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్ని విభాగాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ముందుగా ఆమె ఆలయంలో క్యూలైన్లు, పార్కింగ్‌ప్రదేశం, అన్నదాన విభాగం, లడ్డూ ఇతర ప్రసాదాల తయారీ కేంద్రం, డార్మెటరీ, సెంట్రల్‌స్టోర్, సీసీ కెమెరాల పనితీరు, శానిటేషన్ పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు. వకుళమాత అన్నప్రసాదాల విభాగానికి వెళ్లి అన్నదానంలో భోజనం ఎలా ఉందో స్వయంగా తిని చూడటంతో పాటు పలువురి భక్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు అందించే లడ్డూలలో యాలకులను కాస్త పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రసాదాల నాణ్యత మరింత పెంచితే భక్తులకు సంతృప్తి ఉంటుందన్నారు. మరుగుదొడ్ల పరిస్థితిని, ట్యాప్‌ల పనితీరు పరిశీలించారు. తనిఖీల తుది నివేదికను రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌కు అందచేయనున్నట్లు చెప్పారు. ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి, డిప్యూటీ ఈవో భద్రాజీ, ఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.





పట్టిసీమ ఎత్తిపోతల నుంచి నీటి విడుదల .. కోడేరు పుష్కరఘాట్ వద్ద తగ్గిన గోదావరి

సాధారణ స్థాయికి గోదావరి నీటిమట్టం

పోలవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పోలవరంలో గోదావరి నీటిమట్టం బుధవారం నాటికి సాధారణ స్థాయికి చేరుకుంది. నీటి మట్టం తగ్గడంతో కడమ్మ స్లూయిజ్ గేట్లు వరద నీటినుంచి బయటపడ్డాయి. ప్రాజెక్టు స్పిల్వే నుంచి 1,62,044 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 27.700 మీటర్లు, స్పిల్వే దిగువన 17.90 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు.

పట్టిసీమ నుంచి 7,788 క్యూసెక్కులు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 7,788 క్యూసెక్కుల జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు బుధవారం పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఈఈ ఏసుబాబు తెలిపారు. గోదావరి నీటిమట్టం 14 మీటర్లకు పైబడి ఉండడం వలన కృష్ణా డెల్టా, ఉమ్మడి పశ్చిమ డెల్టాలకు ఖరీఫ్ సీజను సాగు నీటి అవసరాల రీత్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 22 పంపులు 22 మోటార్ల ద్వారా నీటిని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

తగ్గిన గోదావరి ఉధృతి

ఆచంట, (ఆంధ్రజ్యోతి): గోదావరి ఉధృతి బుధవారం నాటికి మరింత తగ్గింది. కోడేరులో ఉన్న పుష్కరఘాట్‌లో వరద నీరు బాగా తగ్గడంతో ఘాట్‌లు బయటపడుతున్నాయి.ఇప్పటికే గోదావరి వల్ల ఇసుక ర్యాంప్‌లు నీట మునిగాయి. గోదావరి ప్రవాహం తగ్గడంతో లంకవాసులు రాకపోకలు కొనసాగిస్తున్నారు.



అధ్వానంగా పట్టిసీమ ఫెర్రీ రేవు

పోలవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ ఫెర్రీ రేవు ఇటీవల వరదలకు ఫెర్రీ రేవులో మెట్లపై బురద పేరుకుపోయింది. స్నానానికి, మంచినీళ్ళకు, శివక్షేత్రానికి వెళ్లే వారు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. దీనికితోడు రేవులో అపారిశుధ్యం తాండవిస్తుండడంతో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి మెట్లపై బురద తొలగించి పారిశుధ్యం మెరుగుపరచాలని కోరుతున్నారు.



మండపాకలో తల్లికి వందనం పథకం పొందిన ఆరుగురు విద్యార్థులతో తల్లిదండ్రులు

తల్లికి వందనం.. రూ.78 వేలు

ఒకే ఇంటిలో ఆరుగురికి పథకం సొమ్ములు

తణుకు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో పాఠశాలలో చదివే విద్యార్థులకు అమ్మ ఒడి పథకంలో కుటుంబంలో ఒక్కరికి మాత్రమే డబ్బులు అందించగా ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అర్హత కలిగిన వారందరికీ ఇంటిలో ఎంతమంది పిల్లలు వుంటే అంతమందికి 'తల్లికి వందనం' పథకంలో డబ్బులు జమ చేయడంతో పేద కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. తణుకు రూరల్ మండలం మండపాక గ్రామానికి చెందిన ఒక కుటుంబానికి చెందిన ఆరుగురు పిల్లలకు తల్లికి వందనం పథకంలో రూ. 78 వేలు జమ అవడంతో ఆ కుటుంబం ఆనందానికి అవదుల్లేవు. మండపాక గ్రామంలో అత్తిలి కాలువ గట్టున నివాసం వుంటున్న ఆకుల వెంకటేశ్వరరావు, కుమారి దంపతులకు ఆరుగురు సంతానం. ఐదుగురు అమ్మాయిలు, ఒక అబ్బాయి. వీరంతా మండపాక గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. వీరికి మొదటి విడతలో సొమ్ములు అందలేదు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశం మేరకు విద్యార్థుల ఆధార్ కార్డులు, బ్యాంక్ ఖాతాలను అప్‌డేట్ చేసి మళ్లీ దరఖాస్తు చేసుకోవడంతో ఈనెల 11వ తేదీన ఆరుగురు పిల్లలకు సంబంధించి రూ. 78 వేలు బ్యాంక్ ఖాతాలో జమైనట్లు తల్లి కుమారి తెలియజేశారు.

బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.12 లక్షలు

మొగల్తూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 33 రోజులకు గానూ 12 లక్షల 9 వేల 684 రూపాయల ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో మోకా అరుణ్ కుమార్ తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వర్ధనీడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వివిధ ఆలయాలకు చెందిన సిబ్బంది ఈ హుండీ లెక్కింపు నిర్వహించారు. ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



అమ్మవారి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

హుండీల్లో చిల్లర గల..గల



ద్వారకాతిరుమల చిన వెంకన్న హుండీలలో చిల్లర మోత మోగుతోంది.. శ్రీవారి ఆలయ హుండీల ద్వారా ప్రతీ నెలా దాదాపు రూ.9 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకూ చిల్లర నాణేలు వస్తాయి. అదంతా యూనియన్ బ్యాంకు అధికారులు నోట్లతో పాటు తీసుకుని వెళ్తారు. అక్కడ నుంచి ఆ చిల్లర మూటలు తాడేపల్లిగూడెంలోని సంబంధిత ప్రధాన కార్యాలయానికి చేరుతుంది. ప్రస్తుతం ద్వారకాతిరుమల యూనియన్ బ్యాంకులో రూ.35 నుంచి 40 లక్షల వరకూ చిల్లర మూటలు కట్టి ఉందని అధికారులు చెబుతున్నారు.

ద్వారకా తిరుమల చిన వెంకన్నకు నెలనెలా రూ. 10 లక్షల వరకు చిల్లర

బ్యాంకులో పేరుకున్న నాణేల మూటలు

నగదు రహిత లావాదేవీలే కారణం

ద్వారకాతిరుమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఏడుకొండల వెంకన్నకు నిత్యం భక్తులు సమర్పించే చిల్లర నాణేల కారణంగా గతంలో ప్రజలకు చిల్లర చిక్కులు తప్పేవి.. అయితే ప్రస్తుతం నగదు రహిత లావాదేవీల కారణంగా చిల్లరతో ఎవరికీ పని ఉండటం లేదు. దీంతో బ్యాంకుల్లో గుట్టల్లా పేరుకు పోతున్న చిల్లరను వదిలించుకోవడమే బాంకర్లకు కాస్త సమస్యగా మారింది. ఒకప్పుడు జిల్లాలోని వ్యాపారులు ఈ చిల్లర నాణేల కోసం ఎప్పుడు స్వామివారి హుండీలు తీస్తారా అని కాసుకుని కూర్చొనేవారు. ఇప్పుడా పరిస్థితులు లేవు. అధిక శాతం మంది ప్రజలు యూపీఐ పేమెంట్లు చేసేస్తున్నారు. కరోనాకు ముందు వరకూ పెద్ద నోటు పట్టుకుని ఏ షాపునకు వెళ్లినా చిల్లర కావాలండీ అనే మాట వినాల్సి వచ్చేది. డిజిటల్ నగదు చెల్లింపులు వినియోగంలోకి రావడంతో నగదు చెల్లింపులు నిలిచిపోయాయి.



హుండీలో వచ్చిన చిల్లర జల్లెడ పడుతున్న సిబ్బంది

ఊపందుకున్న డిజిటల్ చెల్లింపులు

కరోనా వైరస్ ప్రజలను వణికించే సమయంలో నగదు రహిత లావాదేవీలు ఊపందుకున్నాయి. అప్పట్లో ఏ వస్తువును తాకాలన్నా ప్రజలు భయపడేవారు. ఇదే సమయంలో కరెన్సీ నోట్లను ముట్టుకుంటే కరోనా వస్తుందన్న ప్రచారంతో ఈ నగదు రహిత లావాదేవీలకు ప్రజలు మొగ్గుచూపారు. అప్పటి నుంచి డిజిటల్ లావాదేవీలు గణనీయమైన వృద్ధిరేటును నమోదు చేశాయి. గత కొంతకాలం క్రితం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఈ నగదు రహిత లావాదేవీలను 70 శాతం పైబడి మైలురాయి దాటాలని ఆర్‌బీఐ ఉన్నతాధికారులు సూచించారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు ఈ లావాదేవీలను అభివృద్ధి చేసేందుకు పోటీ పడుతున్నాయి. అన్ని బ్యాంకుల్లోను నూరుశాతం నగదు రహిత లావాదేవీలను ఆర్‌బీఐ ప్రోత్సహిస్తోంది.

చిల్లర చిక్కులు తప్పాయి

గతంలో వందరూపాయలు కావాలన్నా పనులన్నీ మానుకుని బ్యాంకుల వద్ద గంటల తరబడి నిలబడి ఉండాల్సిన పరిస్థితి ఉండేది. అలాగే కొన్నాళ్ల క్రితం వరకూ కూడా చాలా మంది తమ పర్సులోనో, జేబులోనో చిల్లర నాణేలు పెట్టుకునేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి కన్పించడం లేదు. చిల్లరను ఎవరూ తమతో తీసుకెళ్లడం లేదు. చిల్లరంతా పోగేసి దేవాలయాలకు వెళ్లినప్పుడు హుండీలలో వేస్తున్నారు. దీంతో ఆలయాల్లో హుండీ లెక్కింపు సమయంలో పెద్ద మొత్తంలో చిల్లర లభిస్తోంది.

అయ్యో..రామయ్యపేట గోడు పట్టదా ?

పోలవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఖాళీ చేసిన గ్రామాల్లో మొదటిది రామయ్యపేట.. ఆ గ్రామానికి మొదట ప్రకటించిన పరిహారాలే తప్ప నూతనంగా ప్రకటించిన పరిహారాలు అందక, పునరావాస కాలనీలలో మౌళిక వసతులు లేక గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు లేకపోవడం వల్ల వర్షం కురిస్తే నీరు నిలిచి అవస్థలకు గురవుతున్నారు. వీధి దీపా లేక అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండడం వలన విష సర్పాలు, కీటకాల బెడద ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఫస్ట్ ఫేజ్‌లో 8 గ్రామాలు, సెకండ్ ఫేజ్‌లో 19 గ్రామాలు తరలించారు. ఈ గ్రామాల్లో పూర్తిస్థాయి మౌళిక వసతులు కల్పించపోవడతంతో నానా ఇబ్బందులు పడుతున్నారు.పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి తొలుత ప్రధానంగా అవసరమైన ప్రాంతం ఉన్న గ్రామం కొత్తరామయ్యపేట గ్రామం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరిగినది ఈ గ్రామంలోనే. 2016 మే 16 న రామయ్యపేట గ్రామాన్ని పునరావాసాలకు తరలించారు. ఇది గిరిజనేతర వ్యవసాయ క్షేత్ర గ్రామం. ఈ గ్రామంలో 580 ఎకరాల పచ్చని పంటపొలాల సాగు భూములను సేకరించారు. భూమికి భూమి ఇవ్వలేదు. ఎకరాకి 1.85 లక్షల పరిహారం మాత్రమే ఇచ్చి సరిపెట్టారు. గ్రామాలు ఖాళీ చేసి పది సంవత్సరాలు కావస్తున్నా జగన్ ప్రకటించిన అదనపు పరిహారం 10 లక్షల కోసం గత ప్రభుత్వ పాలనలో పునరావాస గ్రామ ప్రజలు ఎదురు చూసి, కార్యాలయాల చుట్టూ విసిగివేసారిపోయారు. ప్రస్తుత ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరిస్తుందనే ఆశాభావంతో పునరావాస గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ గ్రామాల రైతులకు భూములకు భూమి ఇవ్వకపోవడం వలన వ్యవసాయమే ఆధారంగా ఉన్న రైతులు, వ్యవసాయ కూలీలు, ఇతర గ్రామాలకు ఉపాధి కోసం వ్యవసాయ పనులకు వలస పోవలసిన పరిస్థితులు ఎదురయ్యాయి. దీనికి తోడు ఆ గ్రామానికి స్మశాన భూములు



కేటాయించకపోవడం వలన గ్రామస్థులెవరయినా చనిపోయిన సందర్భంలో మృతదేహాలను 33 కిలోమీటర్ల దూరంలో ఉన్న తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు లేదా 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న వేగేశ్వరపురం గ్రామాలకు తరలించవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు స్పందించి తమకు అదనపు పరిహారాలు అందేలా చేయాలని, పునరావసాస కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థలు, సిసి రోడ్లు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, స్మశాన స్థలం కేటాయించాలని పునరావాస కాలనీల ప్రజలు వేడుకుంటున్నారు.

మమ్మల్ని వదిలేశారు



పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం ముందుగా తరతరాలుగా ఉంటున్న భూమిని వదిలి పునరావాసాలకు వచ్చాం. నామ మాత్రపు పరిహారాలిచ్చి పంపారు. తర్వాత గ్రామాలు ఖాళీ చేసిన వారికి మాత్రం 10 లక్షల పరిహారం అందించారు. మమ్మల్ని గాలికొదిలేసారు. కాలనీల్లో మౌళిక వసతులు లేవు, కొంతమందికి ఇళ్ళ స్థలాలు కూడా ఇవ్వలేదు. మాకు కూడా సెకండ్ ఫేజ్ వారికి ఇచ్చిన తరహాలో పరిహారాలిచ్చి పూర్తి స్థాయి మౌళిక వసతులు కల్పించాలి.

బర్ల వెంకటేశ్వరరావు , రామయ్యపేట నిర్వాసితుడు



శిథిలావస్థలో ఉన్న బొబ్బిలి వంతెనను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

బొబ్బిలి వంతెన పరిశీలించిన ఆర్‌అండ్‌బీ అధికారులు


గణపవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల వారధిగా ఉన్న బొబ్బిలి వంతెనను నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపుతున్నామని ఆర్‌అండ్‌బీ డీఈ మణికుమార్ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన డేంజర్‌లో బొబ్బిలి వంతెన అనే శీర్షికకు స్పందించి బుధవారం తాడేపల్లిగూడెం ఆర్‌అండ్‌బీ డీఈ మణి కుమార్, ఏఈ రవిబాబు, వంతెనను పరిశీలించారు. వంతెన పూర్తిగా శిధిలమైందని ఫుట్‌పాత్‌పై పెద్దపెద్ద రంధ్రాలున్నాయని, సపోర్టు వాల్స్ విరిగిపోయాయని తాత్కాలికంగా ఏం చేయాలి ? శాశ్వతంగా ఎటువంటి పరిష్కారం చేపట్టాలి అన్న విషయంపై ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన నిధులు వెనక్కి వెళ్లిపోయాయయన్నారు. కూటమి ప్రభుత్వం దృష్టికి కూడా వంతెన పునఃనిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దృష్టికి తీసుకెళ్లామని వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు కూడా వెళ్లాయన్నారు. వంతెన పాదచారులకు, చిరు వ్యాపారులకు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడతున్నామని తెలిపారు.

నీటికోసం..

ఇది పుంపుల చెరువు వాటర్ ట్యాంక్ నుంచి భీమవరం పట్టణానికి నీటిని తీసుకువెళ్లే పైప్‌లైన్ ఎయిర్ వాల్వ్.. ఇది వేంద్ర రోడ్డులో ఉంది.. ఇక్కడ సమీపంలో ఉన్న కాలనీవాళ్లకు మంచినీటికి ఇదే ఆధారం.. వారికి ట్యాంకుల ద్వారా నీరు వస్తుంది.. అది సరిపోకపోవడంతో ఇదిగో ఇలా ఎయిర్ వాల్వ్ నుంచి ఎగజిమ్మే నీటిని పట్టుకుని వెళుతుంటారు...

- ఫొటోగ్రాఫర్, భీమవరం





కొరత ఉన్న స్కూళ్లకు మిగులు ఉపాధ్యాయులు

టీచర్ల సెమీ వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు కసరత్తు!



ఏలూరు అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : తగినంతమంది విద్యార్థులు లేని కారణంగా ఉమ్మడి జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మిగులు (సర్‌ప్లస్) ఉపాధ్యాయులను గుర్తించి కొరతవున్న పాఠశాలలకు తాత్కాలిక ప్రాతిపదికన వర్క్ అడ్జస్ట్‌మెంట్ ద్వారా భర్తీచేయడానికి కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. ఈ విషయాన్ని విద్యాశాఖవర్గాలు నిర్ధారించడానికి నిరాకరిస్తు న్నప్పటికీ, అనధికారికంగా మండల స్థాయిలోనే వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేసుకోవ డానికి పలువురు మండల విద్యాధికారులు (ఎంఈవోలు) కార్యాచరణను చేప ట్టినట్టు సమాచారం. గత విద్యా సంవత్సరం (2024-25) మార్చినెల 31వతేదీ నాటి ఎన్‌రోల్‌మెంట్ ప్రకారం పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, టీచర్ పోస్టుల కేటాయింపును ప్రస్తుత విద్యాసంవత్సరానికి (2025-26)కి చేసిన విషయం విధితమే. ఆ మేరకు ఇటీవల టీచర్ల బదిలీల కౌన్సెలింగ్‌ను పూర్తిచేయగా, పలుచోట్ల నూతన బదిలీ స్థానాలను పొందిన ఉపాధ్యాయులు రిలీవర్లు లేకపోవడంతో ఇప్పటికీ పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారు. మరోవైపు పలు పాఠశాలల్లో గత మార్చినెలలో వున్న ఎన్‌రోల్‌మెంట్ ఇప్పుడు లేదు. చాలా పాఠశాలల్లో మరీ ముఖ్యంగా ఒకటో తరగతిలో జీరో ఎన్‌రోల్‌మెంట్ వుంది. మిగతా తరగతుల్లో సరిపడా విద్యార్థులు లేరు. ఫలితంగా పలుచోట్ల టీచర్ల సంఖ్యలో కొరత, మిగులు సమస్యలు తలెత్తాయి. కొన్నిచోట్ల జీరో టీచర్స్ సమస్య ఉంది. ఇంకా జూన్ నెలలో రిటైర్మెంట్లు వల్ల పలుచోట్ల టీచర్లు ఆయా సబ్జెక్టుల్లో లేరు. ఇటువంటి సమస్యలు ఉమ్మడి జిల్లాలో ప్రతీ మండలంలో కనీసం 7 నుంచి 8 స్కూళ్లలో కొనసాగుతున్నాయి. దీనివల్ల కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో 37 మంది విద్యార్థులున్న చోట ఒక టీచరు మాత్రమే ఉండగా, కేవలం 14 మంది విద్యార్థులున్న పాఠశాలల్లో ఇద్దరేసి ఉపాధ్యాయులున్నట్టు గుర్తించారు. ఇదే పరిస్థితి పలు మండలాల్లో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠ శాలల్లో కూడా ఉన్నట్టు అధికారుల పరిశీలనలో తేలింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన ఓ సమావేశంలో టీచర్ల కొరత కారణంగా విద్యాబోధనకు ఎక్కడా విఘాతం కలగనివ్వవద్దని స్పష్టం చేస్తూనే, ప్రత్యామ్నాయ మార్గాలపై కొన్ని మౌఖిక సూచనలు చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే సెమీ వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో పాఠశాలల్లో మిగులు టీచర్లను కొరతవున్న స్కూళ్లకు సర్దుబాటు చేసుకోవడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. వాస్తవానికి వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేయడానికి ప్రభుత్వమే ఒక కటాఫ్ డేట్ నిర్ణయించి, మార్గదర్శకాలను విడుదల చేస్తుంది. ఈ ఏడాదికి వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉండబోదని ఉన్నతాధికారులు సంకేతాలు పంపినప్పటికీ, పాఠశాలల్లో ప్రస్తుత పరిస్థితులను బేరీజు వేసుకుని ఎక్కడి కక్కడ మండలాల పరిధిలోనే క్షేత్రస్థాయి అవసరాలకను గుణంగా ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు చేసుకోవడానికే సిద్ధమయ్యారు. ప్రస్తుతం పనిచేస్తున్న మండలం పరిధి దాటి ఎవరినీ వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేయరాదని ఎంఈవోలు నిర్ణయించినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లాలో బుధవారం తణుకు డివిజన్‌లోని మండలాల పాఠశాలల హెచ్‌ఎంలను అక్కడి డీవైఈవో కార్యాలయానికి పిలిపించి వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు కసరత్తు చేసినట్టు చెబుతున్నారు. ఇదే విషయాన్ని ఉమ్మడి జిల్లా విద్యాశాఖ వర్గాల వద్ద ప్రస్తావించగా స్పందించడానికి నిరాకరించాయి.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

ఒలింపియాడ్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఒలింపియాడ్ ఇంట ర్నేషనల్ ప్రతిభా పరీక్షల్లో తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఐదు జోనల్ లెవల్ ర్యాంకులు సాధించారు. 72 దేశాల నుంచి 96 వేల పాఠ శాలల నుంచి విద్యార్థులు పరీక్షలు రాయగా హిందీలో నలుగురు, మ్యాథ్స్‌లో ఒక ర్యాంకు సాధించినట్టు ప్రిన్సిపాల్ రాజారావు తెలిపారు. సీహెచ్ సురేష్ హిందీలో జోనల్ స్థాయిలో 16వ ర్యాంకు, ఇంటర్నేషనల్ స్థాయిలో 131వ ర్యాంకు సాధించారు.హర్షవర్ధన్ జోనల్ స్థాయిలో 21వ ర్యాంకు, ఇంటర్నేషనల్ స్థాయిలో 150వ ర్యాంకు.పాల్‌సన్ జోనల్ స్థాయిలో 20వ ర్యాంకు, ఇంట ర్నేషనల్‌లో 176వ ర్యాంకు, తానిగడప మురళి హ్యాథ్స్‌లో జోనల్ స్థాయిలో 697వ ర్యాంకు, ఇంటర్నేషనల్ స్థాయిలో 12వేల ర్యాంకులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ , అధ్యాపక బృందం అభినందించారు.

ఉద్యాన వర్సిటీలో తేనెటీగల పెంపకంపై శిక్షణ

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల పెంపకంపై ఆసక్తిగల వారికి ఈనెల 25, 29, 31వ తేదీల్లో వెంకట్రామన్నగూడెం వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీలో శిక్షణ ఇవ్వనున్నట్టు కేవికే ప్రధాన శాస్త్రవేత్త విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనెటీగల పెంపకానికి మకరందం అందించే మొక్కలు, తెనేపెట్టెలు పెట్టడానికి 50 శాతం నీడ ఉన్న ప్రదేశం, పరిశ్రమలకు దూరంగా ఉండే స్థలం ఉంటే సరిపోతుందని వివరించారు. ఎకరానికి 20 నుంచి 25 వేల పెట్టుబడి పెడితే సరిపోతుందని తద్వారా రెండు మూడు రెట్లు ఆదాయం పొందవచ్చని వివరించారు. తెనెటీగల పెంప కానికి అవసరమైనవి కేవీకేలో అందుబాటులో ఉంటాయన్నారు.

బాదంపూడి మత్స్య కేంద్రంలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉంగుటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలం బాదం పూడి దేశీయ జల మత్స్య సంపద కేంద్రంలో శిక్షణ పొందడానికి ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి బి.నర సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్యకారులు, జాలర్లు, సహకార సంఘ సభ్యులు, చేపల పెంపకంపై ఆసక్తి కలిగినవారు ఎస్సీ, ఎస్టీలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉపకార వేతనం లేకుండా 20 సీట్లు కేటాయిస్తామని వివరించారు. ఈ నెల 29వ తేదీ ఉదయం 11 గంట లకు బాదంపూడి మత్స్య కేంద్రంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఎంపికైన వారి వివరాలను 29వ తేదీ నోటీసు బోర్డులో పెడతామన్నారు. మూడు నెలల శిక్షణా కాలం ఉంటుందన్నారు. 5వ తరగతి ఆపైన చదువ ుకున్నవారు 18 నుంచి 30 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలన్నారు. వివరాలకు 95733 37484, 76869 93033, 94923 37469 నంబర్లలో సంప్ర దించాలని జిల్లా మత్స్య శాఖ అధికారి నరసయ్య తెలిపారు.

- ఇటీవల భీమవరం రెస్ట్‌హౌస్ రోడ్డులో ఒక వివాహితతో వివాహేతర సంబంధం పెట్టుకున్న యువకుడు ఆమెను పెళ్లిచేసుకోమని కోరాడు. ఆమె నిరాకరించడంతో బ్లేడుతో ఆమె మెడపై కోసి హత్యాయత్నం చేశాడు. ప్రస్తుతం ఆ యువకుడు జైలులో ఉన్నాడు.
- ఏడాదిన్నర క్రితం భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో భార్య మరో వ్యక్తిని ఇంటికి పిలిపించి సహజీవనం చేస్తూండటంతో భర్త మందలించాడు. ఆమె పద్ధతి మారకపోవడంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- నరసాపురం ప్రాంతంలో ఒక వ్యక్తి భార్యతో గొడవపడి ఒంటరిగా ఉంటున్నాడు. అయితే భార్య వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఆ విషయాన్ని భర్త మరొకరి వద్ద చెప్పి బాధపడ్డాడు. విషయం తెలిసిన భార్య ప్రియుడితో కలిసి భర్తను హతమార్చాలని కుట్రపన్నడంతో విషయం పోలీసులకు తెలిసి భార్యను, ఆమె ప్రియుడిని అరెస్ట్ చేశారు.
- నాలుగేళ్ళ క్రితం తణుకు ప్రాంతానికి చెందిన ఒక మహిళతో భీమవరానికి చెందిన ఒక యువకుడు వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. భర్త లేని సమయంలో ఇంటికి వెళ్ళి భార్యతో సహజీవనం చేస్తున్నాడన్న విషయం భర్తకు తెలిసి కొందరితో కలిసి ఆ యువకుడిని హత్య చేయించాడు. ఈ సంఘటన అప్పట్లో సంచలనమైంది. హత్య చేసిన యువకుడి మృతదేహాన్ని ఆత్మహత్య చేసుకున్నట్టుగా చిత్రీకరించినట్టు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.



వ్యామోహం

- పెరుగుతున్న వివాహేతర సంబంధాలు
- హత్యలకు దారితీస్తున్న వైనం
- చిన్నాభిన్నం అవుతున్న కుటుంబాలు
- రోడ్డున పడుతున్న పిల్లలు
- భారతీయ సంస్కృతికి గొడ్డలిపెట్టు

వివాహేతర సంబంధాలతో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. భర్తను కాదని, మరొకరితో వివాహేతర సంబంధాలు పెట్టుకోవడమే కాక భర్తను హతమార్చేందుకు కూడా వెనుకాడటం లేదు భార్యలు. ఇటు భర్తలు కూడా వివాహేతర సంబంధాలతో భార్యలను దూరం పెడుతున్నారు. ఇలాంటి ఉదంతాలు ఇటీవల కాలంలో ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. వివాహం అంటే నూరేళ్లు భర్తతో జీవితం పంచుకోవలసిన అవసరం ఉందని తెలిసినప్పటికీ కొందరు దుర్మార్గపు ఆలోచనలతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. అవతలి వారిపై వ్యామోహంతో కుటుంబంలో కలహాలు తెచ్చుకుంటున్నారు. తమ పిల్లలను సైతం వదిలించుకోవడానికి ఎంతవరకైనా వెళ్తున్నారు.

భీమవరం క్రైం, జూలై 16(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధాల వల్ల భార్యగాని, భర్తగాని మృతి చెందిన సంఘటనలు జిల్లాలో వందల సంఖ్యలో ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. భర్త ఉద్యోగ, ఉపాధి నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్ళి చాలా రోజుల వరకు రాకపోవడం, భార్యను దూరంగా పెట్టడం వంటి కారణాలతో భార్యలు పెడదోవ పడుతుండగా... భార్యలు కూడా భర్త ఇంటికి రాగానే ఆప్యాయంగా పలకరించకపోవడం, భర్తను దూరంగా పెట్టడం.. తదితర కారణాలతో భర్తలు వేరే మహిళల వ్యామోహంలోకి వెళ్ళిపోతున్నారు. ఆ రకంగా ఇద్దరి మధ్య దూరం ఏర్పడి మనస్పర్థలు మొదలవుతున్నాయి. ఇవి హత్యకు దారితీస్తున్నాయి. బుధవారం పాలకోడేరు మండలంలో ఒక మహిళ తన భర్తతో సహజీవనం చేస్తోందని తెలుసుకుని ఆ మహిళను సిమెంట్ పోల్‌కు కట్టి చిత్రహింసలకు గురిచేశారు. పోలీసులు రంగప్రవేశం చేస్తేనేగాని ఆ మహిళను వదిలిపెట్టలేదు. ఇలాంటి ఘటనలు జిల్లాలో చాలా చోట్ల జరుగుతూనే ఉన్నాయి. భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడంటే కారణం భార్య అర్థం చేసుకోవలసిన బాధ్యత ఉంది. అంతే తప్ప అవతలివారిని హింసకు గురి చేయడం సరికాదు.

హత్యకు దారితీస్తున్న వ్యామోహాలు..

ఎంతో ఇష్టపడి ప్రేమ వివాహాలు, పెద్దలు కుదిర్చిన వివాహాలు చేసుకున్న కొందరు అనవసరమైన వ్యామోహంలోకి వెళ్ళి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. మొదట్లో ఎంతో సఖ్యతగా ఉండే వీరు పిల్లలు పుట్టిన కొన్నాళ్ళ తర్వాత వేరే వారితో వివాహేతర సంబంధాలు కొనసాగించడంతో కుటుంబాల్లో కలహాలు మొదలవుతున్నాయి. దీంతో హత్యల వరకు దారితీస్తుంది. దీంతో పిల్లల భవిష్యత్ అంధకారమైపోతుంది. ఇలాంటి విషయాలపై పోలీసు శాఖ, ప్రభుత్వాలు ఎన్నో రకాలుగా అవగాహన కల్పిస్తున్నప్పటికీ కొందరిలో ఎటువంటి మార్పు రావడం లేదు. అలా చేయడం వల్ల పిల్లలు రోడ్డునపడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా ప్రతి ఒక్కరూ అలాంటి వ్యామోహాల్లోకి వెళ్ళకుండా కుటుంబాలతో ఆనందంగా జీవితాంతం గడపాలి.



-ఆర్‌జి జయసూర్య, డీఎస్పీ, భీమవరం



మహిళను స్తంభానికి కట్టేసిన దృశ్యం

అమానుషం

- మహిళను స్తంభానికి కట్టేసి చిత్రహింసలు
- తన భర్తతో వివాహేతర సంబంధం పెట్టుకుందని ఆగ్రహం
- రక్షించిన పోలీసులు, ఆసుపత్రికి తరలింపు

పాలకోడేరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): తన భర్తతో వివాహేతర సంబంధం పెట్టుకుందని ఒక మహిళను చిత్రహింసలకు గురిచేసిన ఘటన పాలకోడేరు మండలం మోగల్లు పంచాయతీ పరిధిలోని గుత్తులవారిపాలెంలో బుధవారం చోటుచేసుకుంది. గుత్తులవారిపాలెంకు చెందిన దొంగ సుబ్బారావు అదే గ్రామానికి చెందిన ఒక వివాహితతో కొంత కాలంగా వివాహేతర సంబంధం పెట్టుకుని అత్తిలిలో జీవిస్తున్నాడు. దీంతో సుబ్బారావు భార్య, అతని కుటుంబీకులు ఆగ్రహించి మంగళవారం అర్ధరాత్రి కాపు కాచి వారిని పట్టుకుని అక్కడే ఇద్దరికీ దేహశుద్ధి చేశారు. అంతటితో ఆగకుండా వారిద్దరిని బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు గుత్తులవారిపాలెంలోని రావిచెట్టు కింద ఉన్న షెడ్డులోని స్తంభాలకు కట్టేశారు. వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళను ఉదయం 8.30 గంటల వరకు చిత్రహింసలు పెడుతూండటంతో ఆమె లేవలేని స్థితికి చేరింది. సమాచారం అందుకున్న పాలకోడేరు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్ళి వారి కట్లు విప్పి భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి దెబ్బలు తిన్న మహిళను తరలించారు. విషయం ఊరంతా పొక్కడంతో పెద్ద చర్చనీయాంశమయ్యింది. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు దొంగ సుబ్బారావు భార్య, కుమారుడు, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పాలకోడేరు పోలీసులు తెలిపారు.

అదృశ్యమైన తల్లీ కుమారుడి ఆచూకీ లభ్యం

కుటుంబీకులకు అప్పగించిన పోలీసులు



ఆకివీడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చుట్టాల ఇంటికి వచ్చిన వివాహిత ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయింది. తల్లి దండ్రులు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. కైకలూరు మండలం భుజబలపట్నానికి చెందిన మేక వెంకట లక్ష్మి కుమార్తె బత్తిన కల్యాణి తన కుమారుడు షణ్ముఖతో 2023 మే 21న చెరుకుమిల్లిలోని తన మేనత్త ఇంటికి వచ్చింది. 22న రాత్రి ఆమె ఎవరికీ చెప్పకుండా కుమారుడితో సహా ఎటో వెళ్ళిపోయింది. అనేక చోట్ల గాలింపు అనంతరం 2023 మే 31న స్థానిక పోలీస్ స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ హనుమంతు నాగరాజు ఫోన్ నంబర్లు ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కైకలూరు శివారు కొల్లేరు పరిసర ప్రాంతాల్లోని ఆక్వా చెరువులపై పనిచేస్తున్న కళ్యాణిని గుర్తించి బుధవారం పోలీసులు కల్యాణిని తీసుకొచ్చి ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన బండారు



నరసాపురం టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి) ఏం మాధవ్ ఎలా ఉన్నావ్.. మీ నియోజకవర్గం ఎలా ఉంది.. అభివృద్ధి ఎలా జరుగుతోంది.. కార్యకర్తలు ఎలా ఉన్నారు.. అంతా బాగానే ఉందా? అంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆరా తీశారు. బుధవారం ఆమరావతిలో మంత్రి లోకేశ్‌ను మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు మార్యదపూర్వకంగా కలిశారు. అభివృద్ధి, పార్టీ పరిస్థితులపై చర్చించారు. అనంతరం యువగళం పాదయాత్ర విశేషాలను పొందపర్చిన 'ది వాయిస్ ఆఫ్ పీపుల్' అనే పుస్తకాన్ని మంత్రి లోకేశ్ మాధవ్‌కు అందించారు.

ఆ విలేకరిపై చర్యలు తీసుకోండి

బెదిరింపులకు పాల్పడుతున్నాడంటూ ఎస్పీ, కలెక్టర్‌కు రెవెన్యూ ఉద్యోగుల వినతి

భీమవరం క్రైం, జూలై 16(ఆంధ్రజ్యోతి): బెదిరింపులకు పాల్పడుతున్న స్థానిక పత్రికా విలేకరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లాలోని తహసిల్దార్లు, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మికి ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ఎస్పీతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక పత్రికా విలేకరిగా చెప్పుకుంటున్న ఒక వ్యక్తి పాలకొల్లు మండలంలో పాలకొల్లు రూరల్ గ్రామ పంచాయతీలో వేసిన లే అవుట్ల విషయంలో సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారిని ఫోన్ ద్వారా బెదిరిస్తూ విధులకు ఆటంకం కలిగించాడని, ఈ విషయమై పాలకొల్లు తహసీల్దార్ ఆ వ్యక్తిని ప్రశ్నించగా నిరాధారమైన వార్తలు ప్రచురించడంతో పాటు సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నాడని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై బెదిరింపులు

- ఎనిమిది మందిపై కేసు

చింతలపూడి, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్థానిక హయగ్రీవ ప్రైవేటు పాఠశాలలోకి మంగళవారం అనుమతి లేకుండా ప్రవేశించి బెదిరింపులకు పాల్పడిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సతీష్‌కుమార్ తెలిపారు. తమకు సొమ్ములు ఇవ్వాలని, లేదంటే గొడవ చేసి పాఠశాలకు చెడ్డపేరు వచ్చేలా చేస్తామంటూ స్కూల్ ఆఫీస్ రూంలోకి ప్రవేశించి బెదిరింపులకు పాల్పడ్డారంటూ పోలీసులకు యాజమాన్యం ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ స్కూల్ హెడ్ మాస్టర్ షేక్ వకీర్ సాహెబ్ ఎనిమిది మందిపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయగా మండల మేజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేశామన్నారు. చింతలపూడి, లింగపాలెం, టి.నర్సాపురం, కామవరపుకోటలోని ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలపై గతంలో ఈ ఎనిమిది మంది బెదిరింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయని ఎస్‌ఐ తెలిపారు. బైండోవర్ చేసిన వారిలో నూజివీడుకి చెందిన ఉన్నం అనీల్ కుమార్, మునునూరుకు చెందిన జి.ముత్తయ్య, చీలి చందు, జి.వెంకటేశ్వరరావు, నూజివీడుకు చెందిన కొత్తపల్లి వెంకట మహేష్, నూజివీడుకు చెందిన జిజ్జువరపు శ్రీనివాస్, యండ్రపాటి రవీంద్ర, దొంతగాని శివగణేష్‌లు ఉన్నారని ఎస్‌ఐ తెలిపారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

ఏలూరు క్రైం/టి.నర్సాపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక పురుగుల మందుతాగిన వ్యక్తి బుధవారం మృతి చెందాడు. టి.నర్సాపురం మండలం రామన్నపాలేనికి చెందిన మానికల సుబ్బారావు(31)ఈ నెల 4న పురుగుల మందు తాగడంతో ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సుబ్బారావుకు భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ సంఘటనపై వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సుబ్బారావు తల్లి మంగమ్మ ఫిర్యాదుతో హెడ్‌కానిస్టేబుల్ ఎం.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

దాడి కేసులో ముగ్గురికి జరిమానా

యలమంచిలి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఇలపకుర్రు గ్రామానికి చెందిన ఐనపూడి నర్సింహస్వామిపై అదే గ్రామానికి చెందిన ఆకుమర్తి సూర్యారావు, ఆకుమర్తి నాగేశ్వరరావు, ఆకుమర్తి ఏసుబాబు 2019లో దాడి చేశారు. దీనిపై అప్పటి ఎస్‌ఐ కె.గంగాధరరావు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో ఆకుమర్తి సూర్యారావుకు రూ.2500, ఆకుమర్తి నాగేశ్వరరావుకు రూ.200, ఆకుమర్తి ఏసు బాబుకు రూ.200 జరిమానా విధిస్తూ నరసాపురం అడిషనల్ సివిల్ జడ్జి ఎస్.రాజ్యలక్ష్మి బుధవారం తీర్పునిచ్చినట్టు ఎస్‌ఐ కె.గుర్రయ్య తెలిపారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

భీమవరం క్రైం, జూల్ 16(ఆంధ్రజ్యోతి): తన భార్య మంగళవారం రాత్రి నుంచి కనిపించడం లేదంటూ 26వ వార్డు బ్యాంకు కాలనీకి చెందిన పోతుల లక్ష్మణరావు వన్‌టౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. భీమవరం మండలం గూట్లపాడుకు చెందిన లక్ష్మణరావుకు 2009లో వివాహమైంది. భార్యాభర్తల మధ్య గొడవ నేపథ్యంలో వారం రోజుల క్రితం భార్యను మందలించాడు. అది మనస్సులో పెట్టుకున్న ఆమె మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ శేషావతారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాట స్థావరంపై దాడులు.. రూ.2.7 లక్షల స్వాధీనం

జంగారెడ్డిగూడెం, జూలై 16(ఆంధ్రజ్యోతి): గుట్టుగా పట్టణంలో ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై మంగళవారం రాత్రి ఎస్.ఐ. ఎస్.కె.జబీర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో డీకేడీ సత్యనారాయణ, వీవీఎస్ జగదీశ్ కుమార్, సీహెచ్ రామారావు, ఎం.చంద్రశేఖర్, బిక్కిన వెంకటేశ్వరరావు, కొల్లూరి రాంబాబు, దాసరి రామచంద్రరావు, నాయుడు వెంకటేశ్వరరావు, మట్టా అజయ్ కుమార్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2.7 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ. తెలిపారు.



గూడెంలో గోదాములు తనిఖీ చేస్తున్న అధికారులు



చింతలపూడిలో పరిశీలిస్తున్న రికార్డులు



ఏలూరులో తనిఖీలు చేస్తున్న అధికారులు

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్

- నిల్వలు, అనుమతుల పరిశీలన
- పలు చోట్ల అమ్మకాలపై ఆంక్షలు

చింతలపూడి, జూలై 16(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విజిలెన్స్ అధికారులు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్నారు. సరైన పత్రాలు లేని, రికార్డుల్లో లేని ఎరువులు, నకిలీ విత్తనాల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. పలు చోట్ల కేసులు నమోదు చేస్తూ నకిలీలు విక్రయించవద్దంటూ వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. చింతలపూడిలోని వెంకటేశ్వర, శ్రీనివాస ఎరువులు, పురుగు మందుల దుకాణాలను బుధవారం తనిఖీ చేసి సరైన పత్రాలు లేని రూ.66 వేల 756విలువైన ఎరువులు, పురుగు మందులు విక్రయించకుండా నిలుపుదల చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, వ్యవసాయ శాఖ ఎడీలు బి.వెంకటేశ్వరరావు, వై.సుబ్బారావు, ఎంఏవో కె.మురళీకృష్ణ పాల్గొన్నారు.

● కామవరపుకోట: వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు బొడ్డపాటి వెంకటేశ్వరరావు, విజిలెన్స్ సీఐ జి.మధుబాబుల బృందం కామవరపుకోటలోని ఎరువుల దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి తనిఖీ చేశారు. గొడౌన్‌లో అక్రమంగా నిల్వ చేసిన 17 లక్షల రూపాయల విలువైన ఎరువులను విక్రయించకుండా నిలుపుదల చేశారు. తనిఖీల్లో వ్యవసాయశాఖ చింతలపూడి డివిజన్ సహాయ సంచాలకులు యండ్రపాటి సుబ్బారావు, మండల వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

● ఏలూరురూరల్: ఏలూరులోని పలు ఎరువుల పురుగు మందుల దుకాణాల్లో అమరావతి నుంచి వచ్చిన ప్రత్యేక బృందం తనిఖీ చేసింది. ఏలూరులోని శ్రీరామాంజనేయ మెన్యూర్, శ్రీరాఘవేంద్ర, రవి సీడ్స్, ఫెర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎరువుల ఇన్వాయిస్, ఫారం-ఒ, ఇ-పోస్ రిపోర్ట్‌తో గ్రౌండ్ బ్యాలెన్స్ టాలీఅయినది లేనిదీ తనిఖీ చేశారు. బిల్‌బుక్స్ స్టాక్ రికార్డుసు పరిశీలించారు. కొనుగోలుదారులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. శ్రీరామాంజనేయ మెన్యూర్ డిపోలో అమ్మోనియా సల్ఫేట్‌కు నమోదు చేయకపోవడంతో అలాగే రాఘవేంద్ర మెన్యూర్ ఫెర్టిలైజర్స్‌లో కాంప్లెక్స్ ఎరువులకు ఫారం-ఒ లేనందున వాటి అమ్మకాలు నిలుపుదల చేశారు. తనిఖీల్లో అమరావతి కమిషనరేట్ అధికారులు ఏడీఏ డి.కృష్ణారావు, డీఎస్పీ తాతారావు, ఏడీఏ అనిల్ కుమారి, ఎంఏవో బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● పెదపాడు:నిబంధనల మేరకు ఎరువులు, విత్తనాల అమ్మకాలు సక్రమంగా నిర్వహించాలని విజిలెన్స్ డీఎస్పీ తాతారావు తెలిపారు. పెదపాడు సొసైటీ, విత్తనశుద్ధి కేంద్రాల్లో విజిలెన్స్ మరియు వ్యవసాయశాఖ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ డీఎస్పీ తాతారావు మాట్లాడుతూ ఎరువుల అమ్మకాలకు 2027 వరకూ లైసెన్స్ ఉందని, మార్క్‌ఫెడ్ నుంచి ఫారమ్-ఓ రెన్యువల్ చేయించుకోవాలని, అప్పటి వరకూ ఎరువుల అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించారు. తనిఖీల్లో ఏలూరు ఏడీఏ అనిల్ కుమారి, అనపర్తి ఏడీఏ డీవీ కృష్ణ, ఇంఛార్జి ఏవో సృజన, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

● తాడేపల్లిగూడెం రూరల్/ పెంటపాడు : తాడేపల్లిగూడెం పట్టణంలోని ఎరువుల గోదాములను బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. తాడేపల్లిగూడెంలో స్టాక్ పాయింట్, హోల్‌సేల్ స్టాక్ పాయింట్ అమ్మకాల వివరాలు పరిశీలించారు. కోరమండల్ స్టాక్‌పాయింట్, ఎఫ్ ఎంసీ కంపెనీ గోదాములు తనిఖీ చేశారు. రూ.22 లక్షల 43 వేల 950 విలువైన ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేశారు. పెద్దాపురం జలవనరుల కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులు బుల్లిబాబు, విజిలెన్స్ సీఐ గోపాలకృష్ణ, తాడేపల్లిగూడెం ఏడీఏ మురళీకృష్ణ, ఏవో నారాయణరావు పాల్గొన్నారు. పెంటపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఎరువులు, పురుగుమందుల షాపుల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని రూ.1,07,000 లకు సంబంధించిన ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. విజిలెన్స్ అధికారి ఐ.గోపాలకృష్ణ ఏడీఏలు బుల్లిబాబు, కె.గంగాధర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆగిఉన్న ట్రాక్టర్‌ను వ్యాను బలంగా ఢీకొట్టిన ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందాడు. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి జాతీయ రహదారి వద్ద బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ద్వారకాతిరుమల మండలం కోడిగూడేనికి చెందిన దిరిసిపాముల శ్రీను(440 ద్వారకాతిరుమల మండలం నుంచి ట్రాక్టర్‌లో పేడ లోడుతో దువ్వ వస్తున్నాడు. పెదతాడేపల్లి వద్ద వెనుక నుంచి వ్యాన్ ఢీకొట్టడంతో శ్రీను ట్రాక్టర్‌పై నుంచి కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపాడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు శ్రీను కుమారుడు వెంకట సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి నట్టు ఎస్.ఐ. ప్రసాద్ తెలిపారు.

డ్రగ్స్ జోలికి వెళ్లొద్దు

మాదకద్రవ్యాల అవగాహన సదస్సులో ఈగల్ చీఫ్ రవికృష్ణ

ఏలూరు టూటౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ జోలికి వెళ్లొద్దు జీవితాలు నాశనం చేసుకోవద్దని ఈగల్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఏ. రవికృష్ణ విద్యార్థులకు హితవు పలికారు. ఆశ్రం మెడికల్ కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పల్గొన్న రవికృష్ణ మాట్లాడుతూ డ్రగ్స్ భారీన పడకుండా తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని అన్నారు. ఏలూరు రేంజ్‌ఐజీ జీవీజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఆశ్రం వైద్య కళాశాలలో విద్యార్థులు డ్రగ్స్ సేవిస్తున్న దాఖలాలు ఎక్కడా లేవన్నారు.విద్యార్థులు క్రమశిక్షణగా ఉంచడంతో యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆశ్రం ఆస్పత్రిలో డీఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల సమాజానికి చేటన్నారు. ఈగల్ ఎస్పీ నగేశ్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు మత్తుకు దూరంగా ఉంటూ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చేబ్రోలు శ్రీనివాస్, ఆశ్రం డైరెక్టర్ రతీదేవి, సీఈవో డాక్టర్ హనుమంతరావు, వైద్యులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, పోలీసులు

దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలి

ఏలూరుటూటౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఛలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులపై లాఠీఛార్జి చేసి అరెస్టు చేయడం అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 3వ సర్కిల్ వద్ద పారిశుధ్య కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవ్‌లు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాగబాబు, దుర్గాప్రసాద్, వంశీ, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు

జంగారెడ్డిగూడెం, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని జంగారెడ్డిగూడెం ముస్లిం జేఏసీ సభ్యుడు షేక్ ముస్తఫా అన్నారు. మండలం తాడువాయి మసీదులో జీలుగుమిల్లి, అప్పలరాజుగూడెం, దర్భగూడెం, తాడువాయి ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ముస్తఫా మాట్లాడుతూ ముస్లింల పిల్లలు విద్యలో వెనుకబడి ఉన్నారని, మధ్యలోనే చదువు నిలిపివేస్తున్న కారణంగానే అన్నిరంగాల్లో వెనుకబడుతున్నారని అన్నారు. ఈ ఆధునిక కాలంలో కనీసం డిగ్రీ వరకైనా చదవాలన్నారు.

ఆగస్టు 10న విశ్వ బ్రాహ్మణ సంఘం వార్షికోత్సవం

ఏలూరు రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): విశ్వ బ్రాహ్మణ ఉద్యోగ వ్యాపారస్థుల సంక్షేమ సంఘం 10వ వార్షికోత్సవం ఆగస్టు 10న వైఎంహెచ్ హాలులో నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షులు శివశ్రీ, కార్యదర్శి జగదీష్ బుధవారం తెలిపారు. ఈ వార్షికోత్సవంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు పురస్కారాలు, వివిధ రంగాలలో అత్యున్నత స్థాయికి ఎదిగిన విశ్వబ్రాహ్మణ ప్రముఖులను సన్మానించనున్నట్లు తెలిపారు. సంఘీయులు ఈ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ వార్షికోత్సవ బ్రోచర్‌ను సంఘ నాయకులు కార్యాలయంలో ఆవిష్కరించారు. లక్కోజు వెంకటేశ్వరరావు, కోడూరి రామకృష్ణ, బొద్దూరి నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

తివాచీ పరిశ్రమను ఆదుకోవాలంటూ మంత్రికి వినతి

ఏలూరు రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరానికి ప్రసిద్ధి చెందిన తివాచీ పరిశ్రమకు తగిన ప్రోత్సాహం అందించి ఆదుకోవాలని ఏలూరు కార్పొరేట్ సంస్థకు చెందిన ప్రతినిధులు రాష్ట్ర పౌరసంబంధాల శాఖ, జిల్లా ఇంచార్జీ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో బుధవారం పీ4 కార్యక్రమం అనంతరం విజయవాడ బయలుదేరుతున్న మంత్రి మనోహర్‌ని సంస్థకు చెందిన మహమ్మద్ ఇంతియాజ్ అహ్మద్ తన సంస్థ ద్వారా నేసిన తివాచీలను మంత్రి మనోహర్‌కి చూపించారు. ఈ విషయంపై మంత్రి మనోహర్ సానుకూలంగా పరిశీలిస్తానని ఇంతియాజ్ అహ్మద్‌కు తెలియజేశారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, జాయింట్ కలెక్టర్ పి ధాత్రిరెడ్డి, జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

బదిలీ టీచర్లకు జీతాలు చెల్లించాలి

ఏలూరు అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీ అయిన టీచర్లకు ఎంప్లాయిస్ పొజిషన్ ఐడీలను మంజూరుచేసి జీతాలను వెంటనే చెల్లించాలని బుధవారం ఏలూరులో జరిగిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సమావేశంలో సంఘ నాయకులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిటీని నియమించి, ఐఆర్‌ను చెల్లించాలన్నారు. సంఘ నాయకులు రాము, బాలాజీ, నాయక్, సుజాత, ఇంద్రాణి, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలు ఉపయోగకరంగా ఉండాలి : ప్రొఫెసర్ పాము

ఏలూరు అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): బయో మెడికల్ రంగంలో ఉపయోగించే పదార్థాలు మానవ శరీరానికి అనుకూలంగా ఉండాలని, ముఖ్యంగా చికిత్స, శస్త్రచికిత్స, పునరుద్ధరణ ప్రక్రియలకు సహాయపడాలని గౌహతి ఐఐటీ ప్రొఫెసర్ డి.పాము అన్నారు. డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్ మెటీరియల్స్ ఫర్ బయోమెడికల్ అప్లికేషన్స్ అనే అంశంపై బుధవారం సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన అతిథి ఉపన్యాస కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తాముచేసే పనిమీద శ్రద్ధ వహిస్తే మంచి పరిశోధకలవుతారన్నారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ సునీలారాణి, డాక్టర్ జ్యోతిర్మయి, శ్రీలత, అధ్యాపకులు పాల్గొన్నారు.



రిలే దీక్షల్లో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలంటూ దీక్షలు

కుక్కునూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలంటూ పలు విద్యార్థి సంఘాలు, పలు పార్టీల ఆధ్వర్యంలో బుధవారం కుక్కునూరులో రిలేదీక్షలు ప్రారంభమయ్యా యి. పాఠశాల ప్రారంభమై 30రోజులు దాటిన ఇంత వరకు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయలేదన్నారు. ఉన్న ఉపాధ్యాయులంతా బదిలీపై వెళ్లిపోవడంతో విద్యార్థులకు చదువులు చెప్పే పరిస్థితి లేదన్నారు. ఈ దీక్షలు రెండురోజుల పాటు కొనసాగుతాయన్నారు. కె.లెనిన్, వై.నాగేంద్రరావు, కొన్నే లక్ష్మయ్య, వై.సాయికిరణ్, రెడ్డి నాయుడు, వీ.రఘు, గంజి రాజులు, వీరయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వంపై అవగాహన

భీమడోలు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారమయ్యే కేసులపై కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసులు అవగాహన పెంచుకోవాలని భీమడోలు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.ప్రియదర్శిని నూతక్కి అన్నారు. బుధవారం భీమడోలులో మెజిస్ట్రేట్ ప్రియదర్శిని నూతక్కి కళాశాలల విద్యార్థులు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించి జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న సమస్యలకు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం ఏర్పడుతుందని, ఇది ఒక వలంటరీ ప్రక్రియ అని అన్నారు. జూలై నుంచి సెప్టెంబర్ వరకు 90 రోజుల పాటు ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు.

వేగేశ్న ఆనందరాజు సేవలు చిరస్మరణీయం

జంగారెడ్డిగూడెం, జూలై 16(ఆంధ్రజ్యోతి): వేగేశ్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వేగేశ్న ఆనందరాజు సేవలు మరువలేనివని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు అన్నారు. బుధవారం అప్‌ల్యాండ్ క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఆ సంస్థ కార్యాలయం వద్ద ఇటీవల మృతి చెందిన వేగేశ్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వేగేశ్న ఆనందరాజు సంతాప సభ నిర్వహించారు. ఆనందరాజు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో 350 మంది రోగులకు అన్నదానం చేశారు. పెనుమత్స రంగరాజు, గోరంట్ల విజయరామరాజు, భాస్కరరాజు, జగపతిరాజు పాల్గొన్నారు.

పెదనిండ్రకొలనులో సత్యాగ్రహ దినోత్సవం

నిడమర్రు, జూలై 16(ఆంధ్రజ్యోతి): సత్యాగ్రహ ఉద్యమ కర్త మహాత్మాగాంధీ మానవాళికి ఆదర్శనీయుడని జిల్లా సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం పెదనిండ్రకొలను గాంధీ భవన్‌లో సత్యాగ్రహదినం నిర్వహించారు. దక్షిణాఫ్రికాలో మహాత్మాగాంధీ తొలిసారిగా జూలై 16న సత్యాగ్రహ దీక్షను చేపట్టిన రోజుగా చిరస్మరణీయమైందన్నారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఆర్.బంగారురాజు, పెన్మత్ససత్తిరాజు, లక్ష్మీపతిరాజు వేగేశ్న సుబ్బరాజు పాల్గొన్నారు.

చినుకు.. జాడేది!

(5వ పేజీ తరువాయి)

రావడం లేదని కాలువల సామర్థ్యం మేరకు ఎగువ నుంచి నీరు అందజేయాలని నీటి సంఘాల అధ్యక్షులు, డీసీ ఛైర్మన్లు కోరారు. కైకలూరు, కలిదిండి మండలాల్లో అనేక గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నెలకొందని పోల్‌రాజు, సీటీకెనాల్‌కు ఒక్కొక్క కాలువకు 400 క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని, ప్రస్తుతం అధికారులు 300 క్యూసెక్కుల విడుదల చేశామని చెబుతున్నా 250 క్యూసెక్కుల నీరు కంటే ఎక్కువ రావడం లేదన్నారు. 400 క్యూసెక్కుల నీరు తగ్గకుండా తీసుకొచ్చేలా అధికారులు చొరవ చూపాలని కోరారు. ఇరిగేషన్, డ్రెయినేజీ డీఈ రామకృష్ణ, డీసీచైర్మన్లు పొత్తూరి వాసురాజు, నారగాని కొండ, ఏఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆయకట్టు చివరి రైతుకూ సాగునీరు : చింతమనేని

దెందులూరు : సాగునీటి ఇబ్బందులు లేకుండా ఆయకట్టు చివరి రైతు వరకు సాగునీరు అందిస్తామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. కొప్పులవారిగూడెంలోని లాకుల వద్ద పోలవరం కుడికాల్వ స్లూయిజ్ నుంచి సాగునీటిని ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత,మండల అధ్యక్షుడు ఈడ్పుగంటి అనిల్‌తో కలిసి ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం రైతు అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేసే ప్రభుత్వమన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మంచి చేస్తూ ముందుకు వెళ్లాలని, అంతే గానీ పార్టీ అధికారంలో ఉందని టీడీపీ వారైన సరే అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలిస్తే సహించేది లేదని పార్టీ నాయకులను హెచ్చరించారు. వైసీపీ మాదిరిగా తమ నాయకులు, కార్యకర్తలు చెడ్డ పేరు తెచ్చుకోవద్దన్నారు. పెదవేగి సొసైటీ అధ్యక్షుడు తాతా సత్యనారాయణ, సర్పంచ్‌లు తాతా శ్రీరామ్‌మూర్తి, మేకా కనకరాజు, గోదావరి డీసీ చైర్మన్ వెలమాటి రాంబాబు, సీతంపేట కెనాల్ అధ్యక్షులు పర్వతనేని రంగారావు, డాక్టర్ పసుమర్తి మధుబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

చింతలపూడి, జూలై 16(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో సమ్మెటవారిగూడెం గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ బుధవారం సాయంత్రం పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఆయనకు ఇంటింటి వద్ద మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ప్రతీ ఇంటికి వెళ్ళి ఎమ్మెల్యే ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామని వారందరికీ భరోసా ఇచ్చారు.

● బుట్టాయగూడెం: ప్రజలకు సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని పోలవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. బుధవారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాల మేరకు నిమ్మలగూడెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. నాయకులు నిమ్మ నాగు, బి.నాగభూషణం, మొడియం సింగరాజు, చిట్టిబాబు, కనకరావు, అరుణ్‌కుమార్, చోడెం అర్జున్, దెయ్యాల కృష్ణమోహన్, బిర్రం వినష్, సిహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో నాయకులు

● లింగపాలెం: గ్రామాల్లో అవసరాన్ని బట్టి అభివృధి పనులు చేపడతామని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. లింగపాలెంతో పాటు ధర్మాజీగూడెం గ్రామాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే రోషన్ కుమార్‌ను కోరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలకు పూర్వవైభవం తీసుకొచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాల్లో చర్యలు చేపట్టిందన్నారు. గరిమళ్ల చలపతిరావు, మోరంపూడి మల్లికార్జునరావు, మోరంపూడి వరప్రసాద్, పాతూరి శ్రీనువాసరావు, చెరువుగట్టు రామ్మోహన్‌రావు, గజ్జా వెంకటేశ్వరరావు, చిలుకబత్తుల ప్రభాకర్, టి.రాధాకృష్ణ, ఎన్.అంజనేయులు,ఎన్.శ్రీను పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

● ఏలూరుటూటౌన్:పేదలను సంపన్నులుగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 42వ డివిజన్‌లో ఎమ్మెల్యే చంటి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం డబ్బులు పడనివారికి అకౌంట్‌లో పడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గంజాయిని అరికట్టడానికి ప్రతీ డివిజన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, ఇడా ఛైర్మన్ శివప్రసాద్, నగర టీడీపీ అధ్యక్షులు చోడే వెంకట్రత్నం, కోఆప్షన్ సభ్యుల ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

భారీ వాహనాలను కట్టడి చేయండి

చింతలపూడి, జూలై 16(ఆంధ్రజ్యోతి): భారీ వాహనాల రాకపోకలు, పరిమితికి మించి సరుకు రవాణా తదితర అంశాలపై రవాణా శాఖ దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ కోరారు. ఏలూరులో జిల్లా రవాణా శాఖ కమిషనర్, అధికారులతో సమావేశమయ్యారు. వాహన చట్టం నిబంధనలు పాటించాలని, చింతలపూడికి వచ్చే అధిక బరువు వాహనాలపై దృష్టి పెట్టాలన్నారు.

నేడు సైఫన్ ప్రారంభం

దెందులూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): దెందులూరులోని అలుగులగూడెం దారిలో ఉన్న సీతంపేట కాలువపై రాకపోకలు సాగించేందుకు నూతనంగా నిర్మించిన సైఫన్(వంతెన)ను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గురువారం ప్రారంభిస్తారని టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పర్వతనేని రంగారావు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, గోదావరి డీసీ చైర్మన్ వెలమాటి రాంబాబు, అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొంటారన్నారు. అలాగే దెందులూరు సొసైటీ అధ్యక్షుడిగా గారపాటి కొండయ్య చౌదరి, గంగన్నగూడెం సొసైటీ అధ్యక్షుడిగా కూచిపూడి వెంకట కిశోర్(బాబి) ఎమ్మెల్యే సమక్షంలో గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారు.

హోంగార్డుకు ఆర్థిక సాయం

ఉంగుటూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): తమ సిబ్బందికి ఎటువంటి ఆపద వచ్చినా ఆదుకోవడానికి సిద్ధంగా ఉంటామని నిడమర్రు సి.ఐ. రజనీ కుమార్ అన్నారు. చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ వెన్నెముక చికిత్స చేయించుకున్న హోంగార్డు శానం శివాజికి నిడమర్రు సర్కిల్‌లోని పోలీసు సిబ్బంది రూ.లక్ష అందించారు.సిబ్బంది సహకారంతో అందించిన మొత్తాన్ని నిడమర్రు సి.ఐ.నక్కా రజనీకుమార్, చేబ్రోలు ఎస్.ఐ. ఎం.సూర్యభగవాన్‌లు స్వయంగా అందించారు.

డెంటల్ కళాశాలకు ఏ-గ్రేడ్

దెందులూరు, జూలై 16(దెందులూరు): దంత వైద్యంలో సేవలందిస్తున్న దుగ్గిరాల సెయింట్ జోసఫ్ డెంటల్ కాలేజీకి ఏ-గ్రేడ్ అవార్డు వచ్చిందని ఏలూరు ఆర్సీఎం విచారణ(పీఠాధిపతి) పొలిమేర జయరావు తెలిపారు. దుగ్గిరాల డెంటల్ కాలేజీలో వైద్యులను, సిబ్బందిని ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు అభినందించారు.


చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసిన నాయకులు

సీఎం నిర్ణయంపై ఆర్యవైశ్యుల హర్షం

ద్వారకాతిరుమల, జూలై 16(ఆంధ్రజ్యోతి): అమరావతిలో పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టుకు స్మృతివనం ఏర్పాటు నిమిత్తం భూమి కేటాయించడంతో ఆర్య వైశ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం ఆవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ వాణిజ్యవిభాగం అధ్యక్షుడు ఇమ్మడి రత్నాజీ, ఆర్యవైశ్య నేతలు మహంకాళి గంగాధరరావు, కిషోర్, ప్రసాద్, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ఉంగుటూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం కావడంతో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని మలేరియా యూనిట్ తాడేపల్లిగూడెం ఉపఆరోగ్య అధికారి వై.వి.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. బుధవారం కైకరంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎం.ఎల్.హెచ్.పి.లు జయశ్రీ ప్రీతి, గ్రామ ఆరోగ్య కార్యకర్తలు విజయశ్రీ, సునీత, వెంకటేశ్వరమ్మ, ఆశాలు శీలంశెట్టి దయామణి, వరలక్ష్మి, విజయలక్ష్మి, జయలక్ష్మి పాల్గొన్నారు. అవగాహనా కార్యక్రమాలు జూలై 30వ తేదీ వరకు జరుగుతాయన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం

భీమడోలు, జూలై 16(ఆంధ్రజ్యోతి): పోలసానపల్లి గ్రామాభివృద్ధికి కృషి చేసిన సచివాలయ సిబ్బంది సేవలను సర్పంచ్ షేక్ హసీనా రహీమా బేగం కొనియాడారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్లన్న రాగా రమేష్, అఖిల్, శాంతి ప్రియ, జ్యోతి, జోషిలను సర్పంచ్ సత్కరించారు. కరోనా సమయంలో వీరంతా అందించిన సేవలను కొనియాడారు. గ్రామ కార్యదర్శి జయరామకృష్ణ నాయకులు గంజి ఉబ్బారావు, శ్యామ్‌రాజు, రమేష్, శ్రీనుబాబు, బలుసు నాగు, నాగేంద్ర, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

● పెదపాడు: వట్లూరు సచివాలయంలో ఐదేళ్ల పనిచేసి బదిలీలపై ఇతర ప్రాంతాలకు వెళ్తన్న 13 మంది ఉద్యోగులకు ఈవో ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం సన్మానం చేశారు. ఈవో మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎల్లప్పుడూ ప్రజలకు దగ్గరగా ఉండాలని, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పుల్లారావు, బదిలీపై వెళుతున్న ఉద్యోగులతో సిబ్బంది పాల్గొన్నారు.

బూత్ స్థాయి అధికారులకు శిక్షణ

పోలవరం, జూలై16(ఆంధ్రజ్యోతి): మండలంలో బూత్ స్థాయి అధికారులకు డిప్యూటీ తహసీల్దారు కంభంపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఢిల్లీలో శిక్షణ పొందిన ప్రత్యేకాధికారి ప్రవీణ్ బూత్ స్థాయి అధికారులకు వారి విధులు, విధుల నిర్వహణలో నైపుణ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పోలవరం మండల రెవెన్యూ సిబ్బంది వీఆర్వోలు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల విధానం ఆపాలి

కుక్కునూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఆపాలని సీపీఐ మండల సమితి కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య డిమాండ్ చేశారు. కుక్కునూరులో బుధవారం పలు పార్టీల నాయకులతో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది నాలుగుసార్లు విద్యుత్ చార్జీలు పెంచడంతో పాటు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తగదన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

పెదపాడు, జూలై 16(ఆంధ్రజ్యోతి): నాయుడుగూడెం గ్రామానికి చెందిన పేద విద్యార్థి మాతంగి తబితశ్రీ చదువు నిమిత్తం రూ.24 వేలు ఆర్థిక సాయాన్ని సుష్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వల్లూరి వెంకటకృష్ణయ్య బుధవారం అందజేశారు. మాతంటి తబితశ్రీ సీఆర్ఆర్ మహిళా కళాశాలలో బీఎస్సీ చదువుతోంది. తల్లిని కోల్పోవడంతో పాటు ఆర్థికంగా వెనుకబడటంతో చదువు మధ్యలో ఆగిపోకుండా ఉండేందుకు ట్రస్టు తరఫున ఆర్థికసాయాన్ని అందజేసినట్టు తెలిపారు. వల్లూరి సుభద్రాదేవి పాల్గొన్నారు.

మధుబాబుకు స్పోర్ట్స్‌లో డాక్టరేట్

పెదపాడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ సైన్స్ విభాగంలో పురుషుల ఫుట్‌బాల్ క్రీడలో స్పీడ్, సామర్థ్యం, క్విక్‌నెస్, క్రీడాకారులపై వాటి ప్రభావం వంటి అంశాలపై పీహెచ్‌డీ చేసిన కె.మధుబాబు గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందజేసింది. ఏలూరుకు చెందిన మధుబాబు ప్రొఫెసర్ పి.పి.ఎస్.పాల్‌కుమార్ ఆధ్వర్యంలో గత ఐదేళ్లలో ఆయా అంశాల్లో సమగ్రమైన పరిశోధన ద్వారా పీహెచ్‌డీ పూర్తి చేశారు.

దివ్యాంగుడికి ఆర్థిక సాయం ప్రకటన

జీలుగుమిల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దివ్యాంగుడికి లక్ష రూపాయల ఆర్థిక సాయం ప్రకటించారు. మంగళగిరిలో జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జనవాణిలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించే క్రమంలో మారేడుమిల్లి మండలం ఎల్లవరానికి చెందిన రెండు కాళ్లు పనిచెయ్యని దివ్యాంగుడు అమల రవికి లక్ష రూపాయల ఆర్థిక సాయం ప్రకటించి మానవత్వం చాటుకున్నారు. పవన్‌కల్యాణ్ పుట్టినరోజున ఈసాయం అందజేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే వెంట జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి జి.రవికుమార్ ఉన్నారు.

లక్ష్మీగణపతిస్వామికి అభిషేకాలు

ఏలూరుకార్పొరేషన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని సత్రంపాడులోని శ్రీ లక్ష్మీగణపతిస్వామి ఆలయం వద్ద భక్తులు స్వామికి అభిషేకాలు, గరికతో అర్చనలు నిర్వహించారు. బెల్లం నివేదనలు సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.చిననాగేశ్వరరావు, సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు కదంబ ప్రసాద వితరణ జరిపారు.

పంటల బీమా చేయించుకోవాలి

లింగపాలెం, జూలై 16(ఆంధ్రజ్యోతి):మండలంలో ఉన్న ప్రతి రైతు పంటల బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్ అన్నారు. మండలంలోని కొణిజర్ల, ఆసన్నగూడెం గ్రామాల్లో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా ప్రతి రైతు ఎకరానికి రూ.840 కట్టి బీమా చేయించుకోవాలన్నారు. చిలుకబత్తుల ప్రభాకర్, మోదుగు నాగేశ్వరరావు, పలువురు రైతులు వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కిసాన్ డ్రోన్ పంపిణీ

నిడమర్రు జూలై 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బుధవారం ఎనికేపల్లి గ్రామంలో పల్లెపల్లెకు మన పత్సమట్ల కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ తరఫున కిసాన్ డ్రోన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. మండల వ్యవసాయ అధికారిణి ఎం.ఐ. దైవ ఆశీర్వాదం రైతు సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. జనసేన పార్టీ నాయకులు బాలాజీ, వంగా రఘు, బాసి రాజు, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై సచివాలయ సిబ్బందికి సూచన

కామవరపుకోట, జూలై 16(ఆంధ్రజ్యోతి): కె.ఎస్.రామవరం గ్రామంలో పారిశుధ్య ప్రగతి సాధించాలని, స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్-2025 కమిటీ సభ్యులు బి.సునీల్, బి.రాజేష్, ఎం.మధుప్రియలు బుధవారం సూచించారు. సచివాలయ సిబ్బందితో సచివాలయంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో సరళకుమారి, రంగనాయకమ్మ, పంచాయతీ కార్యదర్శి జి.వి. సత్యనారాయణ, వీఆర్వో కొయ్యగూర బాబూరావు, సచివాలయ సిబ్బంది మహేంద్ర, శ్రీదేవి, కావ్యశ్రీ, సూర్యప్రకాష్, అశోక్, వెన్నెలతోపాటు హెల్త్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

టీకాలతో పశు సంపదను కాపాడుకోండి

ద్వారకాతిరుమల, జూలై 16(ఆంధ్రజ్యోతి):రైతులు తమ పశుసంపదను కాపాడుకునేందుకు వ్యాధినిరోధక టీకాలను వేయించాలని పశు సంవర్ధక శాఖ భీమడోలు ఏడీ డా. రవిచంద్ అన్నారు. ద్వారకాతిరుమల శ్రీవారి గోసంరక్షణ శాలలో బుధవారం 310 గొవులకు లంప్ స్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ప్రతి ఒక్కరూ తమ పశువులకు టీకాలు వేయించుకోవాలన్నారు. మండల పశువైద్యాధికారి అంగర సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలి

బుట్టాయగూడెం, జూలై 16(ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం అడ్మిషన్లను ప్రారంభించాలని కోరుతూ బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల ఎదుట ఆందోళన చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈ. భూషణం మాట్లాడుతూ ఇంటర్ ఫలితాలు విడుదలై మూడు నెలలు దాటుతున్నా రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ అడ్మిషన్లను ప్రారంభించకపోవడంతో సరికాదన్నారు. అడ్మిషన్లు పట్ల స్పష్టత లేక పేద విద్యార్థులు ఇతర కళాశాలల్లో జాయిన్ అయ్యి ఫీజుల దోపిడీకి గురవుతున్నట్లు తెలిపారు. బుట్టాయగూడెం శివాలయంలో సమీపంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కోటి రూపాయల వ్యయంతో ప్రారిభంచి 7 సంవత్సరాలు దాటుతున్నా నేటికి పూర్తికాలేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయని పనులు మాత్రం ముందుకు సాగడంలేదన్నారు. యూనియన్ జిల్లా నాయకులు కాకి నాని, బన్నె వినోద్, తెల్లం మంగ, కె.స్వప్న, వి.లక్ష్మీ, వి. చంద్రశేఖర్, రామ్‌చరణ్‌తేజ్, శివకృష్ణ, టి.కల్యాణ్ పాల్గొన్నారు. అనంతరం ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం, జూలై 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజులకాలనీ ప్రాంతంలో చెట్లు తొలగింపు కారణంగా పట్టణంలోని రామచంద్రాపురం, రాజులకాలనీ గృహ, వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు గురువారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలియజేశారు. మండలంలోని కట్టవపాదల వారిగూడెం గ్రామానికి గృహ, వ్యవసాయ విద్యుత్‌లో కూడా మధ్యాహ్నం వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

టి.నరసాపురం పరిధిలో..

టి.నర్సాపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పీర్ అహ్మద్‌ఖాన్ బుధవారం తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు టి.నర్సాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని రుద్రకోటరాజుగూడెంలో ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్నందున ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

పెరుగుతున్న పొగాకు ధరలు

జంగారెడ్డిగూడెం, జూలై 16(ఆంధ్రజ్యోతి): వర్జీనియా క్వాలిటీ పొగాకు ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఒక్క రోజులోనే రూ.34 వరకు పెరిగింది. కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రం -18 లో కిలో క్వాలిటీ పొగాకు గరిష్ట ధర బుధవారం రూ.392 కు చేరింది. జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-32లో రూ.391, గోపాలపురం వేలం కేంద్రంలో రూ.389 కు చేరింది.లో గ్రేడు పొగాకు అన్ని వేలం కేంద్రాల్లో రూ.200లకు మించి పెరగడంలేదు.



పాఠశాలకు సీసీ కెమెరాల అందజేత

ఉంగుటూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): నారాయణపురం వివేకానంద జడ్పీ ఉన్నత పాఠశాలకు 1988-89 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సీసీ కెమెరాలను అందించారు. బుధవారం నారాయణపురం హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు తోట పోతురాజుకు అందించారు. పూర్వ విద్యార్థుల తరఫున వల్లూరి హనుమంతరావు సుమారు రూ.35 వేల విలువైన సి.సి.కెమెరాలను అందించారు. సహ ఉపాధ్యాయుడు ఉనుముల రాంబాబు ఉన్నారు.

సీసీ రోడ్లు నిర్మించాలని విజ్ఞప్తి

బుట్టాయగూడెం, జూలై 16(ఆంధ్రజ్యోతి): సీతప్పగూడెం పంచాయతీ బుద్దులవారిగూడెం గిరిజన గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించాలంటూ బుధవారం బూసరాజుపల్లి క్యాంపు కార్యాలయంలో ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులను పీసా కమిటీ ఛైర్మన్ బన్నె వినోద్ కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో రోడ్లన్ని పూర్తిగా పాడవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని ఛైర్మన్ దృష్టికి తీసుకువెళ్ళారు.

అభివృద్ధికి సహకరించండి

లింగపాలెం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి, మౌలిక సదుపాయాలను కల్పించేందుకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులతో పాటు గ్రామస్థులు కూడా సహకరించాలని హెచ్‌ఎం, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు అన్నారు. సింగగూడెం మోడల్ పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ కె.పవన్, సర్పంచ్ బొంతు రాంబాబులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. పాఠశాలలో శానిటేషన్, తాగు నీరు, బల్లలు, విద్యుత్ మోటార్, కౌంపౌండ్‌వాల్, మెయిన్‌గేట్ ఇలా పాఠశాలలో ఉన్న సమస్యలను వారికి తెలియపరిచారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ కె.పవన్, సర్పంచ్ బొంతు రాంబాబు సహకారంతో కౌంపౌండ్ వాల్, మెయిన్ గేట్ నిర్మాణం పూర్తిచేస్తామని, సమస్యలను పరిష్కరించేలా చూస్తానని కమిటీ ఛైర్మన్ కె.పవన్ తెలిపారు.

హోమియో మాత్రల పంపిణీ

ఏలూరు అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు, జలుబుల ముందస్తు నివారణకు బుధవారం ప్రభుత్వ డీఎల్‌టీసీలో విద్యార్థులు, సిబ్బందికి హోమియో వైద్య నిపుణులు అరుణ, సుదీప్తి హోమియో మాత్రలను పంపిణీ చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ నాగభూషణం, డీఎల్‌టీసీ వైస్ ఛైర్మన్ భాస్కరరామం, మేనేజింగ్ కమిటీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లపై సమావేశం

కుక్కునూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): పోలింగ్ స్టేషన్‌ల చేర్పులు, మార్పుల పై బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. మండలంలో 1250మంది ఓటర్లు దాటిని పోలింగ్ స్టేషన్ నెంబర్-6 ఇబ్రహీంపేట, పోలింగ్ స్టేషన్ నెంబర్ 13 దామరచర్ల, పోలింగ్ స్టేషన్ నెంబర్-16 వింజరం, పోలింగ్ స్టేషన్ నెంబర్ 17 వండపల్లి, పోలింగ్ స్టేషన్ నెంబర్ 23 గ్రామసింగారం, పోలింగ్ స్టేషన్ల చేర్పులు మార్పులపై చర్చించారు. తహసీల్దార్ రమేశ్‌బాబు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఏపీ సీసీ అధ్యక్షుడిగా బిషప్ ఎస్‌డీ రాజు

ఏలూరుటూటౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ చర్చస్(ఏపీసీసీ) నూతన అధ్యక్షుడిగా ఐసీఎం సంఘాల ఆగ్రపీఠాధిపతులు బిషప్ జాన్ ఎస్‌డీరాజు ఎన్నికయ్యారు. విజయవాడ సీఎస్ఐ దర్శన్‌హాలులో ఏపీసీసీ జనరల్ బాడీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఎస్‌డీరాజును ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బిషప్ జార్జ్ పోర్నేలియస్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎన్‌సీసీఐ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ శామ్యూల్, జనరల్ సెక్రటరీ రెవరెండ్ ఆర్‌సీ ఎబినేజర్, ఏపీసీసీ ఉపాధ్యక్షురాలు స్వర్ణలత, ట్రెజరర్ డాక్టర్ జయరావు, తదితరులు పాల్గొన్నారు. బిషప్ ఎస్‌డీ రాజును ఏలూరు ఐసీఎం చర్చ్ కంపౌండ్‌లో బుధవారం ఘనంగా సన్మానించారు.


ఎన్టీఆర్ విగ్రహం ఎదుట నివాళులర్పిస్తున్న చింతమనేని


ప్రమాణ స్వీకారం చేసిన సత్యనారాయణ తదితరులు

ఉత్సాహంగా సొసైటీలకు త్రిసభ్య కమిటీల ప్రమాణ స్వీకారం

దెందులూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): పెదవేగి సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడిగా టీడీపీ జిల్లా కార్యదర్శి తాతా సత్యనారాయణ ప్రమాణ స్వీకారం ఉత్సాహంగా జరిగింది. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, బ్యాంక్ కార్యదర్శి ఆర్.ఎస్.వి.ప్రసాద్‌లు పాల్గొని సత్యనారాయణ చేత ప్రమాణం చేయించారు. బ్యాంక్ డైరెక్టర్లుగా కొమ్మిన సతీశ్, పోతురాజులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి సమన్వయంతో పని చేయాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఈడ్పుగంటి అనిల్, ఏఎంసీ డైరెక్టర్ గారపాటి రామసీత, పార్టీ గ్రామాధ్యక్షుడు కంచన మోహన్‌రావు, సర్పంచ్ మేకా కనకరాజు, కొనకళ్ళ శివమణి గౌడ్, సర్పంచ్‌లు మేకా తాతా శ్రీరామ్మూర్తి, బొప్పన సుధాకర్, మన్నే శ్రీను, మాగంటి మిల్లుబాబు, తెలుగు యువత అధ్యక్షులు మోతుకూరి నాని పాల్గొన్నారు.

పెదనిండ్రకొలనులో కందులపాటి ప్రమాణం..

నిడమర్రు : సొసైటీల ద్వారా రైతులకు మెరుగైన సేవలందించడం కోసం త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసినట్టు ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. బుధవారం పెదనిండ్రకొలను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సొసైటీ అధ్యక్షుడిగా కందులపాటి సత్యనారాయణ, సభ్యులుగా బదిరెడ్డి శ్రీనివాసు, వల్లూరి చినబుజ్జి బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కమిటీని అభినందించారు. మాజీ సొసైటీ ఛైర్మన్ పుప్పాల శ్రీనివాసు, వంగా రఘు, చింతలపాటి బాసిరాజు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వాసురాజు, సర్పంచ్ ముగ్గళ్ల యాకోబు, తదితరులు పాల్గొన్నారు.

పంటకు బీమా చేయించుకోవాలి

ఆగిరిపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): వరి రైతులంతా పంటకు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జే భవాని అన్నారు. బుధవారం ఈదరలో పొలం పిలుస్తోందిలో ఆమె మాట్లాడుతూ నారుమడులలో, నాట్లు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. అనంతరం వ్యవసాయ, ఉద్యాన సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండల ఉద్యానశాఖ అధికారిణి కె. జ్యోతి ప్రియంక పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఆగిరిపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 18వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి. భార్గవి అన్నారు. మండల పరిషత్ అధ్యక్షురాలు గోళ్ళ అనూష అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరుగుతుందన్నారు. సర్పంచ్‌లు, మండల ప్రాదేశిక నియోజకవర్గం సభ్యులు, మండల శాఖ అధికారులు సమగ్ర సమాచారంతో తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.


ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో మాట్లాడుతున్న అమరేంద్ర కుమార్

ఆకాశంలో సగం కాదు.. మూడొంతులకు ఎదిగారు
ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్

నూజివీడు టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆకాశంలో సగం అనే స్థాయి నుంచి 3 వంతులు అమ్మాయిలే ముందు స్థానంలో ఉంటున్నారన్న స్థాయికి బాలికలు ఎదగడం అభినందనీయమని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ రిజిస్ట్రార్ ఎస్. అమరేంద్రకుమార్ అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ సాక్ బిల్డింగ్‌లో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు పొందిన బాలికలకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలోని నాలుగు క్యాంపస్‌లలో 4400 సీట్లుకు గాను ప్రథమ విడత కౌన్సిలింగ్ పూర్తయ్యే సమయానికి 2240 మంది బాలికలు ప్రవేశం పొందడం అభినందనీయమన్నారు. ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొందిన విద్యార్థులు కొత్త వాతావరణంలో తమను తాము మానసికంగా సిద్ధం చేసుకోవాలన్నారు. ట్రిపుల్ ఐటీ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచాలి

ముసునూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి వారిలో నైపుణ్యం పెంచి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సంసిద్ధత మానిటరింగ్ అధికారి, డైట్ అధ్యాపకుడు ఎన్.జోజిబాబు అన్నారు. కాట్రేనిపాడు జడ్పీ పాఠశాలను ఆయన సందర్శించి గత ఏడాది, ఈ ఏడాది టెన్త్ ఫలితాలు, ఎన్‌రోల్‌మెంట్, విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, ఆహారం నాణ్యత, రుచిపై సంతృప్తి వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించేందుకు సూచనలిచ్చారు. ప్రధానోపాధ్యాయిని కె.కుసుమ కుమారి పాల్గొన్నారు.



న్యాయవాదుల బైక్ ర్యాలీ

నూజివీడు టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నూజివీడు పట్టణంలో మధ్యవర్తిత్వం మన దేశం అంశంపై న్యాయవాదులు బైక్ ర్యాలీ నిర్వహించారు. బుధవారం నూజివీడు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ మాట్లాడుతూ ఏళ్ళ తరబడి కేసులు పెండింగ్‌లో ఉండకుండా మధ్యవర్తిత్వమే మంచి మార్గం అన్నారు. ఇలా మధ్యవర్తిత్వం నెరపడం ద్వారా సమయం, డబ్బు పూర్తిగా ఆదా అవుతాయన్నారు. మధ్యవర్తిత్వంపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించే దిశగా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజారంజక పాలనే కూటమి లక్ష్యం

నూజివీడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పరిపాలించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ నూజివీడు పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి అన్నారు. ఇటీవల డిపో మేనేజర్‌ను కలిసి నూజివీడు పట్టణ బీజేపీ నాయకుల అభ్యర్థన మేరకు ఆర్టీసీ అధికారులు విస్సన్నపేట నుంచి మంగళగిరి ఎయిమ్స్‌కు బుధవారం ఉదయం బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. బీజేపీ శ్రేణులు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం మంగళగిరిలో నెలకొల్పిన ఎయిమ్స్ వైద్యరంగంలో ఆంధ్రప్రదేశ్‌కే తలమానికమన్నారు. అధికారులు ఉదయం, మధ్యాహ్నం సర్వీసులు ప్రారంభించారు. బీజేపీ నాయకులు బోను అప్పారావు, వైఎస్ దొరై, ఎం రాజశేఖర్, మాటూరి మాగంటి వాసు, నక్కా నాగ శివ, అంబటి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బూత్ ఇన్‌చార్జ్‌లకు సన్మానం

ముసునూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి టీడీపీ కార్యాక్రమాన్ని నూరుశాతం పూర్తిచేసిన పలు గ్రామాల బూత్ ఇన్‌చార్జ్‌లను టీడీపీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. చిల్లబోయినపల్లిలో 107, 108 బూత్ ఇన్‌చార్జ్‌లు అనగాని సత్యనారాయణ, కండేపు ప్రసాద్‌లు, యల్లాపురంలో 76వ బూత్ ఇన్‌చార్జ్ పర్వతనేని సత్యనారాయణ, వలసపల్లిలో 74 బూత్ ఇన్‌చార్జ్ పామర్తి నాగరాజు, 75 బూత్ ఇన్‌చార్జ్ సుధగాని తులసీరామ్‌లను టీడీపీ మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు, సర్పంచ్‌లు కండేపు రామగిరి, మొక్కపాటి మురళీకృష్ణ, చలసాని దామోదరరావు, గ్రామ అధ్యక్షులు మేదరమెట్ల సురేంద్ర, బాలకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ సూర్యదేవర శ్రీనివాసరావు తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రఘుబాబు మాట్లాడుతూ ముసునూరు మండలం సుపరిపాలనలో తొలి అడుగులో నియోజకవర్గం, జిల్లాలో ప్రథమస్థానంలో ఉందన్నారు. త్వరితగతిన ఈ కార్యక్రమాన్ని పూర్తిచేసేలా కృషి చేస్తున్నట్లు రఘుబాబు తెలిపారు.

ప్లేట్లు, గ్లాసుల వితరణ



కైకలూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వసతులు కల్పించేందుకు పూర్వ విద్యార్థుల చేయూత అభినందనీయమని హెచ్‌ఎం చిట్టూరి సూర్యప్రకాశరావు అన్నారు. బుధవారం తామరకొల్లు జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థులు, అయ్యవారిరుద్రవరం గ్రామానికి చెందిన బుసనబోయిన శ్రీరామమూర్తి, చిగురుకోట గ్రామానికి చెందిన బండారు నాగకోటేశ్వరరావు కలిసి రూ.30వేలు విలువ గల 180 భోజనం ప్లేట్లు, 180 గ్లాసులు హెచ్‌ఎంకు అందజేశారు. దాతలను హెచ్‌ఎం సత్కరించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	103, 111, 122
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475



చిన్నంపేట తమ్మిలేరు కాజ్‌వే

డేంజర్ వే

- ప్రమాదాలకు కేరాఫ్‌గా చిన్నంపేట తమ్మిలేరు కాజ్‌వే
- వరదలొస్తే రెండు మండలాల మధ్య రాకపోకలు బంద్
- అదనపు ఖానాల నిర్మించకపోవడమే అసలు కారణం

చాట్రాయి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలో చిన్నంపేట-చింతలపూడి మండలం శివపురం గ్రామాల మధ్య తమ్మిలేరుపై ఉన్న కాజ్‌వేకి గత వైసీపీ హయాంలో మరమ్మతులు చేసినా చిన్నంపేట వైపు అదనపు ఖానాల నిర్మాణం జరగలేదు. ఎన్నికలకు ముందు ఖానాల నిర్మాణానికి రూ. 20 లక్షలు, చిన్నంపేట నుంచి కాజ్‌వే వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు చేసి టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. కోడ్ రావటంతో పనులు మొదలు కాలేదు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ పనులను రద్దు చేసింది. సుమారు 40 ఏళ్ళ క్రితం ఈ కాజ్‌వేని అసంపూర్తిగా నిర్మించారు. నిధులు సరిపోక చిన్నంపేట వైపు తక్కువ ఖానాలు నిర్మించి, అప్రోచ్ రోడ్డు వేశారు. రెయిలింగ్ కూడా నిర్మించకుండా వినియోగంలోకి తెచ్చారు. దీనితో అనేక ప్రమాదాలు జరిగాయి. ఇద్దరు మృత్యువాతపడ్డారు. ప్రతి ఏటా భారీ వర్షాలు, వరదలకు అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయి రెండు మండలాల మధ్య రాకపోకలు ఆగిపోవటం షరా మామూలే. మండల రైతులకు చింతలపూడి మండలంలో, అక్కడి రైతులకు ఇక్కడ వ్యవసాయ భూములు ఉండటంతో నిత్యం రైతులు, కూలీల రాకపోకలు సాగిస్తారు. రాకపోకలు ఆగిపోయినప్పుడు వారి ఇబ్బందులు వర్ణనాతీతం. ఇప్పటికైనా మంత్రి కొలుసు పార్థసారథి కాజ్‌వేకి అదనపు ఖానాలు, బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.


సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ఆర్యవైశ్య సంఘం హర్షం

కైకలూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టిశ్రీరాములు స్మృతివనం నిర్మాణానికి స్థలం కేటాయించడం అభినందనీయమని ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మాల్యాద్రి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం నియోజకవర్గ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కైకలూరులోని తన కార్యాలయం వద్ద పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు చంద్రబాబునాయుడు పొట్టి శ్రీరాములు స్మృతివనం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించడమే గాక 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని సాధించినందుకు గుర్తుగా 58 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటుచేస్తాననడం అభినందనీయమన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు పైడిమర్రి రాధాకృష్ణ, ఆర్యవైశ్య సంఘం నాయకులు డాక్టర్ పుల్లేశ్వరరావు, బంటుమిల్లి ప్రసాద్, వరదా శ్యామ్, లక్కింశెట్టి మోహన్, అద్దేపల్లి బ్రహ్మజీ, కాశీ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరిపురం అభివృద్ధికి సర్పంచ్ కృషి
రూ. 2 కోట్ల పనులకు ప్రణాళికలు


విశ్వేశ్వరరావు

ముదినేపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వ సహకారంతో గ్రామంలో సుమారు రూ. 2 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులను చేపట్టేందుకు సర్పంచ్ విశ్వేశ్వరరావు ప్రణాళికలను రూపొందించారు. గత నాలుగేళ్లుగా గ్రామంలో 90 శాతం సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. టీడీపీలో 30 ఏళ్లుగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయన శ్రీహరిపురం గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా 4 సార్లు, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో వివిధ హోదాల్లో పదవులు నిర్వహించడంతో విశ్వేశ్వరరావు సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు సాధించేందుకు కృషి చేస్తున్నారు.



మంత్రి సారథికి త్రిసభ్య కమిటీ చైర్మన్ల కృతజ్ఞతలు

చాట్రాయి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలో పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీ చైర్మన్లుగా నియమితులైన మొరంపూడి శ్రీనివాసరావు(చనుబండ), దామెర సత్య రామ్‌కుమార్(తుమ్మగూడెం), యర్రా ప్రసాదరావు(పోలవరం), కట్టా నాగ దుర్గారావు(నరసింహారావుపాలెం) మంగళవారం రాత్రి విజయవాడలో గృహ నిర్మాణశాఖ మంత్రి పార్థసారథిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలకతీతంగా రైతులందరికి రుణాలు మంజూరు చెయ్యాలని, పీఏసీఎస్‌లను బ్యాంకులకు దీటుగా తీర్చిదిద్ది ఆర్థికంగా బలోపేతం చెయ్యాలని చైర్మన్లకు మంత్రి ఉద్బోధించారు. వీరి వెంట మండల టీడీపీ అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన


సోమవరంలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న బృందం

చాట్రాయి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమవరం గ్రామంలో బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ-2025 కేంద్ర బృందం పర్యటించింది. జిల్లాలో ఉత్తమ గ్రామాల ఎంపికలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నియమించిన అకాడమీ ఆఫ్ మేనేజిమెంట్ స్టడీస్(ఏఎంఎస్) సభ్యులు కె. శివకుమారి, స్వచ్ఛ భారత్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎం. ఉషారాణి, ప్రేమ్‌జిత్, సురేష్ కుమార్ గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై ప్రజల అభిప్రాయాలు సేకరించారు. సంపద తయారీ కేంద్రం, పంచాయతీ కార్యాలయం, యుపీ స్కూల్, అంగన్వాడీ కేంద్రం తనిఖీ చేసి పరిశుభ్రత, మరుగుదొడ్లు వాడకం, తాగునీటి సౌకర్యం, మధ్యాహ్న భోజనం తదితర అంశాలను పరిశీలించి వివరాలు నమోదు చేశారు. గ్రామంలో ఇంటింటికి తడి పొడి చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్‌కు తరలింపు, వాన పాముల ఎరువు తయారీ, కచ్చా డ్రెయిన్లు నిర్వహణ మొదలైనవి పరిశీలించారు. ఎంపిక చేసిన గృహాలకు వెళ్ళి మరుగుదొడ్లు ఎప్పుడు నిర్మించారు. బిల్లులు వచ్చాయా, క్రమం తప్పకుండా ఉపయోగిస్తున్నారా? ఇళ్ళలో అనారోగ్యం ఇతర సమస్యలతో బాధపడే వారు ఉన్నారా, మొదలైన ప్రశ్నలు లబ్ధిదారులను అడిగి రికార్డు చేశారు. నూజివీడు డీఎల్‌పీవో సుందరి, ఎంపీడీవో విజయలక్ష్మి, సర్పంచ్ శోభనబాబు, టీడీపీ నాయకుడు యర్రోజు రామ్‌ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలిదిండి: పెదలంకలో బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటించింది. గ్రామ సచివాలయం, అంగన్ వాడీ కేంద్రాలు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ సెంటర్, సంపద కేంద్రం, జడ్పీ హైస్కూల్స్, నాగేశ్వర స్వామి దేవాలయంతో పాటు ఇళ్ల వద్ద టాయిలెట్స్, డ్రైనేజీ సౌకర్యాలను పరిశీలించారు. ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర, ఈవోపీఆర్డీ రమేష్, కార్యదర్శులు సురేష్, శంకర్, రాంబాబు, మానస, సునీత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ముదినేపల్లి మండలంలో పర్యటన

ముదినేపల్లి: కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ సర్వేక్షణ బృందం గురువారం ముదినేపల్లి మండలంలో పర్యటించనున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో బి. అశోక్ తెలిపారు. ఈ బృందం మండలంలోని పెదగొన్నూరు, పెనుమల్లి గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకం, ప్రభుత్వ పథకాల అమలును పరిశీలిస్తుందని తెలిపారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి


ఆగిరిపల్లిలో ప్రచారంలో పాల్గొన్న నాయకులు

ఆగిరిపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనతోనే రాష్ట్ర అభివృద్ధి అని టీడీపీ ఆగిరిపల్లి పట్టణ అధ్యక్షుడు పామర్తి నరసింహారావు, సర్పంచ్ లక్ష్మీ విక్టర్ బాబు అన్నారు. సుపరిపాలనలో భాగంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు వివరించి, కరపత్రాలను అందజేశారు. ప్రజల అవసరాలను అడిగి తెలుసుకుని, ప్రభుత్వం అన్ని విధాలా తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మండల టీడీపీ ట్రెజరర్ వై ప్రవీణ్, నాయకులు మడుపల్లి గోపాల్, చాన్ బాషా, ఉలస గోపినాథ్, ఎస్ఎస్ బాబు, జే మారుతి, పుసునూరు వంశీ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండి పంచాయతీ పరిధి ఇందిరా కాలనీలో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు బోయిన గోవింద్, తోట గోల్లయ్య, భట్రాజు ఏసుబాబు, పండు జాన్ రాజు, ఎస్‌కె.సులేమార్, ఎం.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వస్త్రాల వితరణ

ముదినేపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలోని పంచాయతీ పారిశుధ్య కార్మికులు, వృద్ధులకు మండల పరిషత్ అధ్యక్షుడు రామిశెట్టి సత్యనారాయణ వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. తన పుట్టిన రోజు సందర్భంగా బుధవారం ఆడంబరాలను తగ్గించి సుమారు 300 మంది పారిశుధ్య కార్మికులు, వృద్ధులకు వస్త్రాలను అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ రాచూరి రాద, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గంటా సంధ్య, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శీలం రామకృష్ణ, ముదిరాజ్ సంఘ రాష్ట్ర కార్యదర్శి కోమటి విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులకు, వృద్ధులకు వస్త్రదానం చేస్తున్న ఎంపీపీ సత్యనారాయణ, నాయకులు

కావడి ఉత్సవానికి బిందెల బహూకరణ

ముదినేపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 20న ఆడికృత్తిక కావడి సేవా మహోత్సవం జరుగనుంది. ఈ ఉత్సవానికి గుడివాడ మహిళా భక్త బృందం 60 బిందెలు, ఆవకూరుకు చెందిన చలమలశెట్టి నిరంజన్ బాబు, ఉత్తమ కుమార్ 32 బిందెలు, ఆనందాసు ఉదయ సాయి కుమార్ 24 బిందెలను ఏసీ గంగా శ్రీదేవికి అందజేశారు.

ఘనంగా ‘ఒక చెట్టు తల్లి పేరుతో’..

ముదినేపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని వికాస్ కళాశాలలో బుధవారం కేంద్ర ప్రభుత్వం మేరా యువ భారత్ సంస్థ నిర్దేశించిన "ఒక చెట్టు తల్లి పేరుతో" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉద్యానవన శాఖ పంపిణీ చేసిన వంద మొక్కలను కళాశాల ఆవరణలో విద్యార్థులు నాటారు. కళాశాల కరస్పాండెంట్ జి.మదన్ కిశోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వి.ఎస్.వీరభద్రరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కిశోర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి రమేష్, వ్యవసాయ సహాయకురాలు ప్రియాంక, వైస్ ప్రిన్సిపల్ కొత్తూరు వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నూజివీడు టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బైకులు ఢీకొని ఒకరు మృతి చెందగా ఇద్దరు తీవ్ర గాయాలపాలైన ఘటన నూజివీడు ఫైర్ స్టేషన్ వద్ద చోటు చేసుకుంది. బత్తులవారి గూడెం నుంచి ద్విచక్ర వాహనంపై నూజివీడు వస్తున్న రాజేష్‌బాబు, సిద్ధమూరి సిరిల్ బాబులు యానాదుల కాలనీ వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న సూరజ్‌ను ఢీకొట్టడంతో రాజేష్ బాబు తీవ్ర గాయాలపాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సూరజ్, సిరిల్ బాబులు సైతం తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. నూజివీడు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

ముదినేపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అత్తింటి వేధింపులు తట్టుకోలేని ఓ వివాహిత పుట్టింటికి చేరింది. పోలీసుల కథనం ప్రకారం ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామానికి చెందిన మున్ని అనే యువతికి కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి గ్రామానికి చెందిన అర్జా దుర్గా ప్రసాద్‌తో 2023లో వివాహమైంది. ఆ సమయంలో కట్నకానుకలుగా ఆమె పుట్టింటి వారు రూ. 2 లక్షలు నగదు ఇచ్చారు. భర్త దుర్గా ప్రసాద్ వ్యసనాలకు ఆ సొమ్మును ఖర్చు చేసేసి గత కొంత కాలంగా పుట్టింటి నుంచి మరింత సొమ్ము తెమ్మని భార్యను వేధించడం ప్రారంభించాడు. భర్తతో పాటు మున్నికి అత్తమామలు, బావ నుంచి కూడా వేధింపులు పెరగడంతో పాటు గత నెల 14న మున్నిని భర్త, అత్త కొట్టి ఇంటి నుంచి గెంటేశారు. దీంతో ఆ యువతి అల్లూరు పుట్టింటికి చేరింది. అయినా అత్తింటి వారు వదలకుండా ఈ నెల 2న అల్లూరు వచ్చి మున్నిని విడాకులు ఇవ్వాలని ఒత్తిడిచేయగా ఆమె అందుకు అంగీకరించకపోవడంతో వివాదం ఏర్పడింది. అత్తింటి వారు ఆమెను కొట్టి తలుపులకు బయట గెడవేసి వెళ్ళి పోయారు. దీంతో మున్ని బుధవారం ముదినేపల్లి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి మహిళా హెచ్‌సి సుధావాణి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల యాజమాన్యంపై బెదిరింపులు

చింతలపూడి, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్థానిక హయగ్రీవ ప్రైవేటు పాఠశాలలోకి మంగళవారం అనుమతి లేకుండా ప్రవేశించి బెదిరింపులకు పాల్పడిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సతీష్‌కుమార్ తెలిపారు. తమకు సొమ్ములు ఇవ్వాలని, లేదంటే గొడవ చేసి పాఠశాలకు చెడ్డపేరు తెస్తామంటూ స్కూల్ ఆఫీస్ రూంలోకి ప్రవేశించి బెదిరింపులకు పాల్పడ్డారంటూ పోలీసులకు యాజమాన్యం ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ స్కూల్ హెడ్ మాస్టర్ షేక్ పకీర్ సాహెబ్ ఎనిమిది మందిపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి మండల మేజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేశామన్నారు. చింతలపూడి, లింగపాలెం, టి.నర్సాపురం, కామవరపుకోటలోని ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలపై గతంలో ఈ ఎనిమిది మంది బెదిరింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయని ఎస్‌ఐ తెలిపారు. బైండోవర్ చేసిన వారిలో నూజివీడుకి చెందిన ఉన్నం అనిల్ కుమార్, ముసునూరుకు చెందిన జి.ముత్తయ్య, చీలి చందు, జి.వెంకటేశ్వరరావు, నూజివీడుకు చెందిన కొత్తపల్లి వెంకట మహేష్, నూజివీడుకు చెందిన జిజ్జువరపు శ్రీనివాస్, యండ్రపాటి రవీంద్ర, దొంతగాని శివగణేష్ ఉన్నారని ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం

కలిదిండి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కలిదిండికి చెందిన కడలి ప్రమీల దేవి (25) భర్తతో మనస్పర్థల కారణంగా పుట్టింటి వద్దే ఉంటోంది. ఈమెకు ఒక కుమారుడు ఉన్నాడు. ఈ నెల 12న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రమీలదేవి తిరిగి రాలేదు. దీంతో ఆమె కోసం గాలించినా ఆచూకీ లేకపోవడంతో తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొమ్మ కత్తిరింపుతో అధికాదాయం

నూజివీడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కొమ్మ కత్తిరింపుల ద్వారా మామిడిలో అధిక ఆదాయాన్ని పొందవచ్చునని మామిడి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త జి. శాలిరాజు అన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నూజివీడు మండలం బత్తులవారిగూడెంలో మామిడి తోటల్లో కొమ్మ కత్తిరిపులు, ఎరువుల యాజమాన్య పద్ధతులపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పూత కాపు సరిగా వచ్చి పురుగులు, తెగుళ్ళ ఉధృతి తగ్గాలంటే కచ్చితంగా కొమ్మ కత్తిరింపులు చేపట్టాలన్నారు. కొమ్మ కత్తిరింపుల అనంతరం బ్లైటాక్స్‌ను కత్తిరించిన చోట పోయాలని సూచించారు. పదేళ్లకు పైబడిన మామిడి చెట్లకు రెండు కేజీల యూరియా, నాలుగు కేజీల సూపర్ ఫాస్ఫేట్ రెండు కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను ఎరువుల యాజమాన్యంలో భాగంగా అందించాలన్నారు. ఉద్యాన వన శాఖ అధికారిణి ఆర్. హేమ, సర్పంచ్ లక్ష్మీకాంతమ్మ, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

చినుకు.. జాడేది!

(5వ పేజీ తరువాయి)

రావడం లేదని కాలువల సామర్థ్యం మేరకు ఎగువ నుంచి నీరు అందజేయాలని నీటి సంఘాల అధ్యక్షులు, డీసీ చైర్మన్లు కోరారు. కైక లూరు, కలిదిండి మండలాల్లో అనేక గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నెలకొందని పోల్‌రాజు, సీటీకెనాల్‌కు ఒక్కొక్క కాలువకు 400 క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని, ప్రస్తుతం అధికారులు 300 క్యూసెక్కుల విడుదల చేశా మని చెబుతున్నా 250 క్యూసెక్కుల నీరు కంటే ఎక్కువ రావడం లేదన్నారు.400 క్యూసెక్కుల నీరు తగ్గకుండా తీసుకొచ్చేలా అధికారులు చొరవ చూపాలని కోరారు. ఇరిగేషన్, డ్రెయినేజీ డీఈ రామకృష్ణ, డీసీచైర్మన్లు పొత్తూరి వాసురాజు, నారగాని కొండ, ఏఈ సత్యనారాయణ, నీటిసంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆయకట్టు చివరి రైతుకూ సాగునీరు : చింతమనేని

దెందులూరు : సాగునీటి ఇబ్బందులు లేకుండా ఆయకట్టు చివరి రైతు వరకు సాగునీరు అందిస్తామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. కొప్పులవారిగూడెంలోని లాకుల వద్ద పోలవరం కుడికాల్వ స్లూయిజ్ నుంచి సాగునీటిని ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత,మండల అధ్యక్షుడు ఈడ్పుగంటి అనిల్‌తో కలిసి ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం రైతు అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేసే ప్రభుత్వమన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మంచి చేస్తూ ముందుకు వెళ్లాలని, అంతే గానీ పార్టీ అధికారంలో ఉందని టీడీపీ పార్టీ వారైన సరే అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలిస్తే సహించేది లేదని పార్టీ నాయకులను హెచ్చరించారు. వైసీపీ మాదిరిగా తమ నాయకులు, కార్యకర్తలు చెడ్డ పేరు తెచ్చుకోవద్దన్నారు. పెదవేగి సొసైటీ అధ్యక్షుడు తాతా సత్యనారాయణ, సర్పంచ్‌లు తాతా శ్రీరామ్‌మూర్తి, మేకా కనకరాజు, గోదావరి డీసీ చైర్మన్ వెలమాటి రాంబాబు, సీతంపేట కెనాల్ అధ్యక్షులు పర్వత నేని రంగారావు, డాక్టర్ పసుమర్తి మధుబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.